




# వార్తాప్రభ

RNI No. APTEL/2004/12176

epaper : https://varthaprabha.com

సమగ్ర వార్తా దినపత్రిక

Circulated Telangana & Andhra Pradesh States


## ఉపాధి అవకాశాలే లక్ష్యం.. ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థతో ఏపీ ఒప్పందం

**అమరావతి: మే 5 (వార్తా ప్రభ ప్రతినిధి)** ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో ఆధునిక సాంకేతికతను అందిపుచ్చుకొని యువతకు ఉపాధి అవకాశాలు పెంచడమే లక్ష్యంగా విద్య, ఐటీ, ఎలక్ట్రానిక్స్ శాఖల మంత్రి నారా లోకేశ్ చొరవతో ష్నైడర్ ఎలక్ట్రిక్ సంస్థ ఏపీ ప్రభుత్వంతో ఒప్పందం కుదుర్చుకుంది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్య అభివృద్ధి సంస్థ, ష్నైడర్ ఎలక్ట్రిక్ ఇండియా ఫౌండేషన్ ప్రతినిధులు ఎంవోయూపై సంతకాలు చేశారు. ఎలక్ట్రానిక్స్, గ్రీన్ ఎనర్జీ, నిర్మాణ రంగాల్లో జాతీయ, అంతర్జాతీయ స్థాయి అవకాశాలను అందుపుచ్చుకునేందుకు ప్రతిభావంతులైన బృందాలను తయారు చేయడమే ఈ ఒప్పందం లక్ష్యం. దీని ప్రకారం ప్రభుత్వ ఐటీఐలు, పాలిటెక్నిక్ కళాశాలలు, ఎన్ఏసీ శిక్షణా కేంద్రాల్లో 20 అధునాతన ట్రైనింగ్ ల్యాబ్‌లను ఏర్పాటు చేయనున్నారు.


సంపుటి : 24 | సంచిక : 64 | ది. 06-05-2025 | విజయవాడ | మంగళవారం | పేజీలు : 8 | వెల : రూ. 1/-


# ప్రభుత్వ సేవలన్నీ వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే

- పనుల కోసం ప్రజలు కార్యాలయాలకు వచ్చే పరిస్థితి కల్పించకూడదు
- వాట్సాప్ గవర్నెన్స్ వినియోగిత పెరగాలి
- వర్క్‌ఫ్రం హోం ఉద్యోగాల కల్పన వేగవంతం చేయాలి
- ఆర్టీజీఎస్‌పై సమీక్షలో సీఎం చంద్రబాబు నాయుడు

**అమరావతి, మే 5 (వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రజలు తమ పనుల కోసం కార్యాలయాల చుట్టూ తిరిగే పరిస్థితులు ఉండకూడదని, ప్రభుత్వ సేవలన్నీ పౌరులకు మన మిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ఆన్‌లైన్‌లో పొందేలా చూడాలని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధికారులను ఆదేశించారు. సచివాలయంలో సోమవారం రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ కార్యకలాపాలపై సీఎం చంద్రబాబు నాయుడు సమీక్ష నిర్వహించారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారానే ప్రజలు ప్రభుత్వం నుంచి అన్ని సేవలు పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ గురించి ప్రజల్లో అవగాహన పెంచేలా విస్తృతంగా దీని గురించి ప్రజల్లోకి తీసుకెళ్లాలన్నారు. ప్రభుత్వం అన్ని సేవలు కూడా ప్రజలు ఎలాంటి అవరోధాలు లేకుండా ఆన్‌లైన్‌లో పొందేలా చర్యలు తీసుకోవాలన్నారు. ప్రభుత్వ శాఖలన్నీ కూడా ఈ దిశగా తమ కార్యకలాపాలను మెరుగుపరచుకోవాలన్నారు. డేటా లేక్ పనులు వేగవంతం చేయాలని సూచించారు. డ్రోన్‌ల ద్వారా ప్రజలకు మెరుగైన సేవలు కల్పించాలని, ప్రజలు డ్రోన్ సేవలు విరివిగా వినియోగించుకునేలా చర్యలు తీసుకోవాలని తెలిపారు. డ్రోన్‌ల ద్వారా ఎన్ని యూస్ కేసెస్ అందించగలమనేది ప్రజలకు వివరించి వారు ఆయా సేవలు పొందగలిగే ఏర్పాట్లు చేయాలన్నారు. యూస్ కేసెస్ అందించే సంస్థలు, ప్రభుత్వ విభాగాలతో ఒక వర్క్‌షాపు పెట్టి ప్రభుత్వ శాఖలు, అధికారులకు కూడా దీనిపైన అవగాహన పెరిగేలా చేయాలని సూచించారు. దోమల నివారణకు పురపాలక శాఖ, ప్రజారోగ్య శాఖలు డ్రోన్‌లను ఎక్కువగా వినియోగించాలని సీఎం ఆయా శాఖల అధికారులకు సూచించారు. వర్క్‌ఫ్రం హోం కార్యక్రమం కూడా వేగవంతంగా అమలయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. దీన్ని నిరంతరం ప్రమోట్ చేస్తూ ఒక ప్రణాళికాబద్ధంగా ముందుకెళ్లాలన్నారు. రాబోయే మూడు సంవత్సరంలో ఎన్ని ఉద్యోగాలు అందుబాటులోకి రాగలవు, ఎంతమందికి ఉద్యోగాలు కల్పించగలం, వారికి ఎలాంటి నైపుణ్యాలు అవసరమనేదానిపై సమగ్ర కసరత్తు చేయాలన్నారు. అవసరమైతే ఒక కన్సల్టెన్సీ కూడా నియమించుకోవాలని సూచించారు. వర్క్‌ఫ్రం హోం చేయడానికి అందుబాటులో ఉన్న మానవ వనరులకు నైపుణ శిక్షణ ఇప్పించాలని సూచించారు. ఆర్టీజీ కార్యదర్శి భాస్కర్ కాటంనేని మాట్లాడుతూ డేటా లేక్ పనులు దాదాపుగా పూర్తయ్యాయని తెలిపారు. వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా ప్రస్తుతం 273 రకాల సేవలు అందిస్తున్నామని, జూన్ 12వ తేదీలోపు 370 నుంచి 380 సేవలను అందిస్తామని చెప్పారు. ఆర్టీజీఎస్‌లో అవేర్ హబ్ ఏర్పాటు చేసి ఎప్పటికప్పుడు వాతావరణ మార్పులను అధ్యయనం చేసి సేవలు అందజేస్తామని తెలిపారు. పిడుగులు, వర్షాలు, ఉష్ణోగ్రత, ఎండలు తదితర వాతావరణ పరిస్థితులు ఆయా ప్రాంతాల్లో ఎలా ఉన్నాయో ఎప్పటికప్పుడు ప్రజలకు తెలియజేస్తామని తెలిపారు. పిడుగుల గురించి ఒక గంట ముందే పౌరుల మొబైల్ ఫోన్లకు ఐవీఆర్ఎస్ వెళ్లేలా ఆర్టిఫిషియల్ ఇంటిలిజెన్స్‌ను ఉపయోగించుకోబోతున్నట్లు చెప్పారు. పౌరులు ఫోన్ ఎత్తగానే ఏఐ ఆధారిత ఐవీఆర్ఎస్ హెచ్చరిక వారికి వెళుతుందన్నారు. ఈ సమావేశంలో ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె.విజయానంద్, సీఎం కార్యదర్శులు ముద్దాడ రవిచంద్ర, పీఎస్ ప్రద్యుమ్న, సమాచారశాఖ సంచాలకులు హిమాన్షు శుక్లా, రెవెన్యూ శాఖ కార్యదర్శి ప్రభాకర్ రెడ్డి, ఆర్టీజీఎస్ సీఈఓ ప్రఖర్ జైన్, డిప్యూటీ సీఈఓ ఎం. మాధురి తదితరులు పాల్గొన్నారు.




## సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే 'సమరం' అంటే ఎలా?- రేవంత్‌రెడ్డి

**హైదరాబాద్, మే 5 (వార్తా ప్రభ ప్రతినిధి)** ప్రభుత్వంపై సమరమే అంటూ ఉద్యోగ సంఘాలు ప్రకటించడంపై సీఎం రేవంత్‌రెడ్డి మండిపడ్డారు. మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా సమరం చేస్తారు? అని ప్రశ్నించారు. తనను కోసినా సరే.. వచ్చిన ఆదాయానికి మించి ఖర్చు చేయలేనని సీఎం స్పష్టం చేశారు. ఓ మీడియా సంస్థ నిర్వహించిన కార్యక్రమంలో ఆయన తీవ్ర ఆవేదనతో మాట్లాడారు. "ఇక సమరమే అని ఉద్యోగ సంఘాలు ప్రకటిస్తున్నాయి. మీ సమరం తెలంగాణ ప్రజలపైనా?మొదటి తారీఖునే జీతాలు ఇస్తున్నందుకా?. కొన్ని రాజకీయ పార్టీలు మాపై ఆరోపణలు చేస్తున్నాయి. ఉచిత విద్యుత్ పేరుతో విద్యుత్ బకాయిలు పెట్టి వెళ్లారు. ప్రభుత్వం అంటే మేం ఒక్కరమే కాదు.. మనమంతా కలిస్తేనే ప్రభుత్వం. మనం పాలకులం కాదు.. సేవకులం. ఆర్థిక ఇబ్బందుల్లో ఉంటే సహకరించాల్సిన ఉద్యోగ సంఘాలే సమరం అంటున్నాయి. ప్రజలు కష్టాల్లో ఉంటే అండగా ఉండాల్సిన బాధ్యత ఉద్యోగ సంఘాలపై లేదా? సమస్య ఉంటే చర్చించుకుందాని ఉద్యోగ సంఘాలకు విజ్ఞప్తి చేస్తున్నా.ప్రభుత్వాన్ని అస్థిరపరచాలని రాజకీయ పార్టీలు కుట్ర చేస్తున్నాయి. వారి కుట్రలో ఉద్యోగ సంఘాలు పావులుగా మారొద్దు. కొత్త కోరికలతో ధర్నాలు చేస్తే ఉన్న వ్యవస్థ కుప్పకూలుతుంది. ఉద్యోగ సంఘాలు బాధ్యత మరిస్తే సమాజం సహించదు. అప్పులు పుట్టినా ఏదైనా చేయొచ్చు. కానీ, ఎక్కడా అప్పు పుట్టట్లేదు. రాష్ట్ర ఆర్థిక వ్యవస్థ దెబ్బతింది.. స్వీయ నియంత్రణే పరిష్కారం. ప్రభుత్వం మన కుటుంబం.. కుటుంబం పరువును బజారున పడేయొద్దు. ఇప్పుడు కావాల్సింది సమరం కాదు.. సమయస్ఫూర్తి, సంయమనం. తెలంగాణను మళ్లీ కోతుల గుంపునకు అప్పగించొద్దు. నాతో కలిసి రండి.. తెలంగాణను అభివృద్ధి పథంలో తీసుకెళ్దాం." అని రేవంత్‌రెడ్డి అన్నారు.సరిహద్దుల్లో సైనికుల్లా తెలంగాణ పోలీసులు రాష్ట్రంలో శాంతిభద్రతలను పరిరక్షిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డి అన్నారు. శాంతిభద్రతలు అదుపులో ఉన్నాయి కాబట్టే.. తెలంగాణ రాష్ట్రం ప్రపంచస్థాయి పెట్టుబడులను ఆకర్షించగలుగుతోందన్నారు. విధినిర్వహణలో చనిపోయిన పోలీసుల కుటుంబాలకు భరోసా ఇస్తున్నామని చెప్పారు. విధినిర్వహణలో మరణించిన ఐపీఎస్‌ల కుటుంబాలకు రూ.2 కోట్లు, అదనపు ఎస్పీ, ఎస్పీ కుటుంబాలకు రూ. కోటిన్నర ఆర్థిక సాయం చేస్తున్నామన్నారు. నేరం జరగకుండా నియంత్రించే బాధ్యత పోలీసులపై ఉందని చెప్పారు.



## భగీరథ జయంతి కార్యక్రమానికి ముఖ్య అతిథిగా మంత్రి సవిత

**గాజువాక, మే 5 (వార్తా ప్రభ ప్రతినిధి)** భగీరథ మహర్షి మహా జ్ఞాని అని పరోపకారానికి దీక్షకు సహనానికి ప్రతిరూపమని మంత్రి సవిత పేర్కొన్నారు. భగీరథుని వారసులుగా సగరులు ఎంతో పట్టుదల, శ్రమ, నిజాయితీతో ఉంటారని కొనియాడారు. భగీరథుని ఆశయాలను కొనసాగించాలని, ఆయన చూపిన సంకల్ప బలంతో బీసీ వర్గాల్లోని సామాన్యులు ఉన్నత స్థాయికి ఎదగాలని ఆకాంక్షించారు.

# పేద ప్రజల వైద్య సేవల నిమిత్తం కేఎస్ పీఎల్ అందించిన సహకార చాలా గొప్పది

### - జిల్లా కలెక్టరు షాన్ మోహన్

**కాకినాడ మే 5 (వార్తా ప్రభ ప్రతినిధి)**-కేఎస్ పిఎల్ సీఎస్ఆర్ నిధులు రూ.55 లక్షల వ్యయంతో సమకూర్చిన ఎక్విప్మెంట్ ను జీజీహెచ్ కు అప్పగించిన జిల్లా కలెక్టర్, ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఇతర ప్రజాప్రతినిధులు.. నిత్యం వేలాది మందికి వైద్య సేవలు అందిస్తున్న కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆస్పత్రికి కాకినాడ సీపోర్ట్ లిమిటెడ్ రూ.55 లక్షలతో ఎక్విప్మెంట్ అందజేయడం అభినందనీయమని జిల్లా కలెక్టరు షాన్ మోహన్ పేర్కొన్నారు. కాకినాడ ప్రభుత్వ సామాన్య ఆసుపత్రికి సామాజిక బాధ్యత కింద కాకినాడ సీ పోర్టు లిమిటెడ్ ప్రజా సంక్షేమర్థం విరాళంగా అందించిన 3 వెంటిలేటర్లను, 8 మల్టీపారా మానిటర్లు, 8 ఐసీయూ పడకలు, 8 గైనకాలజీ పరిశీలన బెంచీలను సోమవారం జీజీహెచ్ ట్రామా కేర్ లో జిల్లా కలెక్టరు షణ్మోహన్..కాకినాడ పార్లమెంటు సభ్యులు తంగేళ్ల ఉదయ్ శ్రీనివాస్, ఎమ్మెల్సీ కర్రి పద్మశ్రీ, పేరాబత్తుల రాజశేఖరం, కాకినాడ ఎమ్మెల్యే వనమాడి వెంకటేశ్వరరావు, జనసేన పార్టీ నాయకులు మర్రెడ్డి శ్రీనివాసు,కేఎస్పీఎల్ ఎండీ కె.వి.రావు తదితర ప్రముఖుల చేతుల మీదుగా ప్రారంభించి జీజీహెచ్ వైద్యులకు అప్పగించారు. అనంతరం సర్జరీ సెమినార్ హాల్లో జరిగిన ప్రత్యేక సమావేశంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టరు మాట్లాడుతూ జీజీహెచ్ కు సంబంధించి ఈ రోజు చాలా ప్రత్యేకమైనదన్నారు. సంవత్సర కాలంలో రూ.55 లక్షలతో ఎక్విప్మెంట్ సమకూర్చడం చాలా సంతోషంగా ఉందన్నారు. ఉభయగోదావరి జిల్లాలతో పాటు ఇతర ప్రాంతాల ప్రజలకు విరివిగా వైద్య సేవలు అందిస్తున్న జీజీహెచ్ వైద్య సేవలను మరింత బొలోపేతం చేసేందుకు కేఎస్పీఎల్ గొప్ప తోడ్పాటును అందించిందని ఈ సందర్భంగా కెఎస్ పిల్ ఎండీ కేవీ.రావుకు జిల్లా కలెక్టర్ షాణ్ మోహన్ ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. వైద్య సేవలు అందించడంలో కాకినాడ జీజీహెచ్ రాష్ట్ర స్థాయిలోనే మంచి పేరు సంపాదించుకుందని, ఈ ఆసుపత్రి మరింత అభివృద్ధి చేయడాని ప్రభుత్వం కృషి చేస్తుందని దీనితో పాటు జిల్లాలోని ఇతర ఆసుపత్రుల అభివృద్ధికి తమ సహాయ సహకారాలు అందించాలని జిల్లా కలెక్టరు కోరారు. పార్లమెంట్ సభ్యులు తంగెళ్ల ఉదయ శ్రీనివాస్ మాట్లాడుతూ నాలుగైదు జిల్లాల నుంచి ప్రజలు నిత్యం జీజీహెచ్ కు వైద్య సేవలు నిమిత్తం వస్తూ ఉంటారన్నారు. గత సంవత్సరంలో 8 లక్షల మంది ఔట్ పేషెంట్లు, 17 వేల మంది ఇన్ పేషెంట్స్ వైద్య సేవలు పొందగా సుమారుగా 45 వేల సర్జరీలు జీజీహెచ్ ద్వారా జరిగాయని ఎంపీ తెలిపారు. జీజీహెచ్ అభివృద్ధికి ప్రజాప్రతినిధులుగా తాము,అధికారులు తమ వంతు బాధ్యతగా చిత్తశుద్ధితో కృషి చేయడం జరిగిందన్నారు. రంగరాయ వైద్య కళాశాలకు టీచింగ్ ఆసుపత్రిగా జీజీహెచ్ అనుబంధంగా పనిచేస్తూ భవిష్యత్తు తరాలకు వైద్య సేవలను అందించే వైద్యులను అందిస్తుందన్నారు. క్యాన్సర్ కేసులు ఎక్కువగా నమోదు అవుతున్న నేపథ్యంలో త్వరలో జీజీహెచ్ లో ప్రత్యేక క్యాన్సర్ విభాగాన్ని ఏర్పాటు చేసేందుకు జిల్లా కలెక్టరు ప్రత్యేక ప్రణాళికలు సిద్ధం చేస్తున్నట్లు ఆయన తెలిపారు. ఇంత పెద్ద ఆసుపత్రిని మరింత అభివృద్ధి చేసే లక్ష్యంతో కేఎస్పీఎల్ సామాజిక బాధ్యత కింద అందించిన సహకారం చాలా గొప్పదని ఎంపీ ఈ సందర్భంగా కొనియాడారు. భవిష్యత్తులో పీఎం స్వీయ సురక్ష యోజన కింద గౌరవ పీఎం నరేంద్ర మోడీ సహకారాన్ని కోరడం జరుగుతుందని, జీజీహెచ్ కు అవసరమైన మౌలిక సదుపాయాల కల్పనకు తన వంతు బాధ్యతగా కృషి చేయడం జరుగుతుందని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు.






## మే 7న ఆర్టీసీ సమ్మె..హైదరాబాద్‌లో భారీ కవాతు

**హైదరాబాద్, మే 5 (వార్తా ప్రభ ప్రతినిధి)** ఈ నెల 7న సమ్మెకు పిలుపునిచ్చిన తెలంగాణ ఆర్టీసీ జేఏసీ.. సమ్మె సన్నద్ధతలో భాగంగా భారీ ఎత్తున కార్మికులతో కవాతు నిర్వహిస్తోంది. ఆర్టీసీ కళాభవన్ నుంచి ప్రారంభమైన కవాతు.. బస్ భవన్ వరకు కొనసాగనుంది. తమ సమస్యలను పరిష్కరించాలని పలుమార్లు ప్రభుత్వం దృష్టికి తీసుకెళ్లామని, విధిలేని పరిస్థితుల్లో సమ్మె నోటీసులు కూడా ఇచ్చామని ఆర్టీసీ జేఏసీ ఛైర్మన్ వెంకన్న తెలిపారు. అయినప్పటికి యాజమాన్యం చర్చలకు ఆహ్వానించకపోవడంతో సమ్మె సన్నద్ధతలో భాగంగా కవాతు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. ఆర్టీసీ కార్మికుల కవాతు దృష్ట్యా పోలీసులను భారీగా మోహరించారు.

## దేవదాయ ధర్మదాయ శాఖ

### శ్రీ విశ్వేశ్వరస్వామివారి దేవస్థానం కలవపూడి, కృష్ణాజిల్లా

**టెండరు కం బహిరంగ వేలంపాట ప్రకటన**

కృష్ణాజిల్లా, గుడివాడ మండలం, కలవపూడి గ్రామంలో వేంచేసియున్న శ్రీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానమునకు సర్వ హక్కు భుక్తములలో గల ఈ క్రింది వుదహరించిన భూములు, లైసెన్సు హక్కునకు గాను ది. 8-5-2025 గురువారం ఉదయం 11:00 గంటలకు సదరు శ్రీ విశ్వేశ్వరస్వామి వారి దేవస్థానం వద్ద శ్రీయుత ఇన్‌స్పెక్టరు దేవాదాయ శాఖ, గుడివాడ వారి సమక్షంలో 3 సంవత్సరముల కాలపరిమితికి టెండరు కం బహిరంగ వేలంపాట నిర్వహించబడును. ఆసక్తి కలవారు పాటలో పాల్గొనవలయును.

| వ. నెం. | భూమి ఉన్న గ్రామము | ఆర్.ఎస్.నెం. | విస్తీర్ణం య. సెం. | ధరావత్తు | వేలంపాట జరుగు స్థలం |
|---|---|---|---|---|---|
| 1 | కలవపూడి అగ్రహారం | 26/1 | 5.12 | 5,000 | శ్రీ విశ్వేశ్వరస్వామి దేవస్థానం వద్ద ఉ॥ 11 గం॥లకు |
| 2 | మోటూరు | 654/2 | 6.34 | 6,000 | |
| 3 | చినపాలపర్రు | 325/1 | 5.25 | 5,000 | |

**కొన్ని ముఖ్యమైన షరతులు**

1. ఈ బహిరంగవేలం పాట దేవదాయ ధర్మదాయ శాఖ అధికారుల మంజూరు ఉత్తర్వులకు లోబడి సంస్థ కార్యనిర్వహణాధికారిచే జరుపబడుచున్నది.
2. దేవస్థానమునకు బకాయిలు ఉన్నవారు గాని లేదా లావాదేవీలు ఉన్నవారు గాని పాటలో పాల్గొనరాదు.
3. పాటలో పాల్గొనువారు పాటకు ముందుగా తనకు గల స్థిరాస్తి దస్తావేజులు లేక పట్టాదారు పాస్‌పుస్తకం మరియు టైటిల్ డీడ్ హామీగా ఇచ్చి ధరావత్తు చెల్లించి పాటలో పాల్గొను నిర్ణయం.
4. ఈ వేలం పాట బస్తాల రూపంలో కాకుండా నగదు రూపేణా నిర్వహించబడును.
5. మిగిలిన పాట షరతులు పాట కాలమందు చదివి వినిపించబడును.
6. ఇతర వివరములకు దేవస్థానం ఆఫీసు పనిచేయు దినములలో సంప్రదించగలరు.
7. వేలం పాటలో పాడుకున్న నగదు మొత్తమును అడ్వాన్స్ రూపంలో ముందుగానే చెల్లించు నిర్ణయం.

**కలవపూడి**
28-4-2025

ఇట్లు
**వంశపారంపర్య ధర్మకర్త**

# మంచి ప్రభుత్వంపై ఎందుకు కక్ష ?

### కూటమిపై కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు విష ప్రచారం సరికాదు
### అభివృద్ధిని చూసి ఓర్వలేకే శిలాఫలకం ధ్వంసం
### టిడిపి రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్

**అమరావతి మే 5 (వార్తా ప్రభ ప్రతినిధి)** రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం మంచి ప్రభుత్వంపై ఎందుకు ఇంత కక్ష అని, కొందరు ఐఏఎస్, ఐపీఎస్ అధికారులు విష ప్రచారం చేయడానికి తెలుగుదేశం పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి పాతర్ల రమేష్ తీవ్రంగా ఖండించారు. అమరావతిలో సోమవారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం హయాంలో అమరావతిలో జరుగుతున్న అభివృద్ధి పనులను చూసి ఓర్వలేక కొందరు వైసీపీకి అనుకూలంగా ఉన్న ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు కూటమి ప్రభుత్వంపై కక్ష కట్టి విష ప్రచారానికి శ్రీకారం చుట్టడాన్ని ఆయన తీవ్రంగా ఖండించారు. రాష్ట్రంలో మంచి ప్రభుత్వం అభివృద్ధి చేసే ప్రభుత్వాన్ని విమర్శించటం వారికి తగదన్నారు. గతంలో కూడా 2019 -2024 లో వైసీపీ ప్రభుత్వ హయాంలో కూడా కొందరు ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు తెలుగుదేశం పై ఇలాంటి విష ప్రచారాలు చేశారని ఆయన గుర్తు చేశారు. మంచి ప్రభుత్వం కూటమి ప్రభుత్వం పై ఇలాంటి విష ప్రచారాలు కొందరు ఐఏఎస్ ఐపీఎస్ అధికారులు తప్పుడు ప్రచారాలు చేయడం మానుకోవాలని ఆయన హెచ్చరించారు ఆంధ్రప్రదేశ్ లో, అమరావతిలో జరుగుతున్న అభివృద్ధిని చూడలేక విద్రోహ శక్తులు తాళ్లాయిపాలెం వద్ద పైపులైన్లను, ఐకానిక్ బిల్డింగ్ వద్ద ఉన్న శిలాఫలకాన్ని ధ్వంసం చేశాయని, విద్రోహ శక్తులను పోలీసులు వెంటనే అరెస్టు చేయాలని పాతర్ల రమేష్, రాష్ట్ర డిజిపికి పంపిన లేఖలో విజ్ఞప్తి చేసినట్లు ఆయన తెలిపారు. జగన్ పాలనలో ప్రజా వేదిక నుండి మొదలైన విధ్వంసం ఐదేళ్లు రాష్ట్రాన్ని సర్వనాశనం చేసిన విద్రోహశక్తుల ఆగడాలు ఇప్పటికీ ఆగక ఇంకా మితిమీరిపోతున్నాయని ఆయన విమర్శించారు. అమరావతి పునర్నిర్మాణాన్ని ప్రారంభించిన ప్రధాని మోదీ కూటమి ప్రభుత్వం వచ్చాక అమరావతి ప్రాంతమంతా ప్రశాంత వాతావరణంలో ఉందని, వైసిపి నేతలు కొందరు ఇలాంటి అలజడలు సృష్టించడము ఇప్పటికైనా మానుకోవాలనికి ఆయన కోరారు. అమరావతిలో శాంతి భద్రతకు విఘాతం కలిగించే విద్రోహశక్తులపై పోలీసులు నిఘా వేసి వారిపై కేసులు నమోదు చేసి అరెస్టు చేయాలని ఆయన డిమాండ్ చేశారు. అమరావతి లో జరుగుతున్న అభివృద్ధిని చూసి వైసిపి ఓర్వలేక అమరావతి రాజధానిపై అంబటి రాంబాబు వంటి వారు కొందరు విష ప్రచారానికి శ్రీకారం చుట్టారని ఆయన విమర్శించారు. అమరావతిలో 54 వేల కోట్లతో ప్రధాని ప్రారంభించిన అభివృద్ధి పనులను చూసి వైసిపి నేతలు విషం కక్కుతున్నారని ఆయన విమర్శించారు. జగన్ కు రైతుల పట్ల ఎప్పుడు చిత్తశుద్ధి లేదన్నారు జగన్ పాలనల్లో రైతులకు చెల్లించాల్సిన 1.674 కోట్ల బత్తాయిలను తమ కూటమి ప్రభుత్వం చెల్లించిందని ఆయన గుర్తు చేశారు. అమరావతిలో రైతులపై జగన్ అక్రమ కేసులు పెట్టి వేధించలేదా? అని ఆయన ప్రశ్నించారు. అమరావతిలో కృష్ణాయపాలెంలో అన్యాయంగా దళిత రైతులపై ఎస్సీలతోనే ఎస్సీ రైతులపై అక్రమ కేసులు పెట్టించి దళిత రైతులకు సంకెళు వేసి జైలుకు పంపిన జగన్ నేడు రైతులకు అన్యాయం జరుగుతుందని మాట్లాడటం దెయ్యాలు వేదాలు వల్లించినట్లు ఉందని ఆయన అన్నారు. ముఖ్యమంత్రి చంద్రబాబు దూర దృష్టితోనే అమరావతి రాజధానికి ప్రపంచ స్థాయిలో గుర్తింపు వచ్చే విధంగా అభివృద్ధి చేస్తున్నారని. అమరావతిలో అభివృద్ధి చూసి ఓర్వలేక వైసీపీ నేతలు కూటమి ప్రభుత్వంపై విమర్శలు చేస్తున్నారని ఆయన విమర్శించారు. రాష్ట్ర ప్రగతిపై ప్రధాని వ్యాఖ్యలు ప్రజలకు ఎంతో నమ్మకాన్ని కలిగించిందన్నారు దేశానికే అమరావతి రోల్ మెడల్ అని ప్రధాని నరేంద్ర మోడీ కొనిఆడటం కారణమన్నారు. జగన్ పాలనల్లో ఏపీకి రాజధాని లేకుండా చేశాడని ఆయన విమర్శించారు. అమరావతిలో క్వాంటం వ్యాలీ ఏర్పాటు అవుతుందని అమరావతిని మరొక హైటెక్ సిటీగా ముఖ్యమంత్రి చంద్రబాబు తయారు చేయడం పట్ల రాష్ట్ర ప్రజలంతా హర్షం వ్యక్తం చేస్తున్నారని పాతర్ల రమేష్ తెలిపారు.



# అభివృద్ధికి బాటలు వేస్తూ 172 కోట్లతో నిర్మించిన ఫ్లైఓవర్ ప్రారంభోత్సవం

**ముఖ్య అతిథిగా పాల్గొన్న కేంద్ర మంత్రి, రాష్ట్ర మంత్రులు శాసనసభ్యులు తదితర ప్రముఖులు.**



**శేరిలింగంపల్లి,మే 5 : (వార్తాప్రభ):**తెలంగాణ రాష్ట్ర అభివృద్ధికి బాటలు వేస్తూ లింగంపల్లి- బి హెచ్ ఈ ఎల్ వద్ద 172. 5 కోట్ల రూపాయలతో 1.65 కిలోమీటర్ల ఫ్లై ఓవర్ ను ముఖ్య అతిథులుగా కేంద్ర రోడ్డు రవాణా,జాతీయ రహదారుల మంత్రి నితిన్ గడ్కరి,కేంద్ర గనుల శాఖ సహాయ మంత్రి కిషన్ రెడ్డి,రాష్ట్ర మంత్రులు ఆరోగ్య మరియు వైద్య కాబినెట్ మంత్రి దామోదర రాజ నరసింహ,చేవెళ్ల ఎంపి కొండ విశ్వేశ్వర్ రెడ్డి,ఆర్ , బీ శాఖ మంత్రి కోమటిరెడ్డి వెంకట్ రెడ్డి,దేవాదాయ , అటవీ శాఖ మంత్రి కొండా సురేఖ,మెదక్ ఎంపీ రఘునందన్ రావు,ఎంఎల్సీ అంజి రెడ్డి,శేరిలింగంపల్లి శాసనసభ్యులు అరేఖపూడి గాంధీ,పటాన్చెరువు శాసనసభ్యులు గూడెం మైపాల్ రెడ్డి,ఎంబీసీ ఛైర్మెన్ జెరిపేటి జైపాల్ తదితర డివిజన్ల కార్పొరేటర్లు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించి ఫ్లై ఓవర్ ను ప్రారంభించిన శేరిలింగంపల్లి కార్పొరేటర్ రాగం నాగేందర్ యాదవ్ ప్రారంభించారు.ఈ కార్యక్రమంలో శేరిలింగంపల్లి డివిజన్ అధ్యక్షులు రాజు యాదవ్,ప్రధాన కార్యదర్శి రవీందర్ గౌడ్,సీనియర్ నాయకులు రవీందర్ రావు, కొండల్ రెడ్డి,యాదా గౌడ్,కే రాంచందర్,రవి యాదవ్,గోపాల్ యాదవ్,రాజ్ కుమార్,మహేష్, మల్లేష్,పవన్,నటరాజ్,తదితర డివిజన్ల నాయకులు,కార్యకర్తలు తదితరులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

## ఫ్లై ఓవర్ ప్రారంభోత్సవంలో కేంద్ర మంత్రి, ఎంపీ తో బిజెపి ఇంచార్జ్ రవి కుమార్ యాదవ్



**శేరిలింగంపల్లి,మే 5 (వార్తాప్రభ):**జాతీయ రహదారి-65పై హైదరాబాద్ లో దాదాపు 172.5 కోట్ల రూపాయలతో 1.65 కిలోమీటర్ల పొడవు నిర్మించిన బీహెచ్ఈఎల్ ఫ్లైఓవర్ ప్రారంభోత్సవ కార్యక్రమంలో కేంద్ర మంత్రి నితిన్ గడ్కరీ,చేవెళ్ల పార్లమెంటు సభ్యులు కొండ విశ్వేశ్వర్ రెడ్డి,మెదక్ పార్లమెంటు సభ్యులు రఘునందన్ రావు తో కలిసి పాల్గొని,జాతికి అంకితం చేసే కార్యక్రమంలో శేరిలింగంపల్లి నియోజకవర్గ ఇంచార్జ్,రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రవికుమార్ యాదవ్ పాల్గొనడం జరిగింది.

# ఈ వంతెనపై ప్రయాణం దిన దిన గండమే....!

**దిన పత్రికల్లో ఎన్ని సార్లు సమస్యను ఎత్తి చూపినా...స్పందించని అధికారులు**





**జి.కొండూరు:మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)** ఎన్టీఆర్ జిల్లా,జి.కొండూరు మండలంలోని కందులపాడు అడ్డరోడ్డు వద్ద బుడమేరు వాగుపై నిర్మించిన వంతెనపై ప్రయాణం దిన దిన గండంగా మారింది.నిత్యం వందలసంఖ్య లో ఈ వంతెన పై భారీ వాహనాల రాకపోకలు జరుగుతుంటాయి.గత ప్రభుత్వం హయాంలో ఈ వంతెన కూలిపోవాడంతో పక్కనే రూ.55 లక్షల నిధులతో లోలెవల్ చప్ట నిర్మించారు.అది కూడా దెబ్బతినడంతో మరో రూ.13 లక్షలతో మరమ్మత్తు లు చేయించారు.అయినా ఫలితంలేదు.ఇటీవల గుడమేరు వాగు తీవ్ర ఉగ్రరూపం దాల్చడంతో వంతెన, లోలెవల్ వంతెనలకు మరోసారి పెద్ద గండ్లు పడ్డాయి. స్థానిక శాసనసభ్యులు వసంత వెంకట కృష్ణ ప్రసాదు ప్రమేయంతో గండ్లు పూడ్చి వాహనాల రాకపోకలను పునరుద్దించారు.అయితే ఓవర్ లోడు తో భారీ వాహనాలు ఈ వంతెన పై నిత్యం ప్రయాణించడంతో లోలెవల్ వంతెన కు రెండువైపులా అప్రోచ్ లు దెబ్బతిన్నాయి.ఈ అప్రోచ్ లపై పెద్ద గుంటలు ఏర్పడి బండ రాళ్లు బయటపడ్డాయి.దీంతో ఈ వంతెనపై ప్రయాణం వాహనదారులకు నరకప్రాయంగా మారింది. అప్రోచ్ రోడ్లపై ఏర్పడ్డ గుంటల్లో ద్విచక్ర వాహన దారులు స్కిడ్ అయ్యి కిందపడి గాయాల పాలవుతున్నారు.ఇంత జరుగుతున్నా అధికారులు,ప్రజా ప్రతినిధులు పట్టించుకోకపోవ డం పట్ల సర్వత్ర విమర్శలు వినిపిస్తున్నాయి. ఇప్పటికే అనేక దినపత్రికల్లో సైతం దీనిపై వార్తా కథనాలు ప్రచురించాయి. అయినా అధికారుల్లో స్పందన లేదు.ఇప్పటికైనా అధికారులు, ప్రజా ప్రతినిధులు స్పందించి కనీసం అప్రోచ్ రోడ్లనైనా సరిచేయాలని ప్రయాణికులు, వాహన చోదకులు కోరుతున్నారు.

# గనిపై అంబులెన్స్ కంపల్సరీ!!

● కార్మికుల శ్రేయస్సుకై కృషి చేయండి ● సమస్యలపై గని మేనేజరుకు వినతి పత్రం ● 11ఇంక్లైన్ టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ వాసర్ల జోసెఫ్

**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)**గనిపై అంబులెన్స్ అందుబాటులో ఉండడం కంపల్సరీ అని 11ఇంక్లైన్ టీబీజీకేఎస్ పిట్ సెక్రటరీ వాసర్ల జోసెఫ్ డిమాండ్ చేశారు. ఈ మేరకు సోమవారం 11వ గని మేనేజరుకు కార్మికుల శ్రేయస్సు కోసం కృషి చేయాలి అంటూ గనిపై 24/7 అంబులెన్స్ అందుబాటులో ఉంచాలని డిమాండ్ చేస్తూ విజ్ఞప్తి పత్రాన్ని అందించారు. అంబులెన్స్ లేక తక్షణమే ప్రథమ చికిత్స అందక ఎంతోమంది కార్మికులు తీవ్ర అనారోగ్యాల పాలవుతున్నారని, కొన్ని సందర్భాలలో ప్రాణాలు సైతం కోల్పోవాల్సి వస్తుంది అని డిమాండ్ పత్రంలో పేర్కొన్నట్లు తెలిపారు. రాజేశం, సురేందర్, శ్రీనివాస్, వంశీ, సురేష్, శ్రావణ్, మహేష్ తదితరులు



విజ్ఞప్తి పత్రాన్ని అందించారు.

# తుపాకి చేత పట్టిన మావోయిస్టులతో మాటల్లేవ్!!

● మోడీ పాలనలో ప్రగతి పథంలో భారత్ ● తెలంగాణకు కాంగ్రెస్, బిఆర్ఎస్ చేసింది ఏమీ లేదు ● తెలంగాణ భవిష్యత్తు బిజెపి ద్వారానే ● కులగణనతో బీసీలకు పూర్తిస్థాయిలో న్యాయం ● కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్

**పెద్దపల్లి/ గోదావరిఖని: మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)**తుపాకి చేత పట్టిన మావోయిస్టులతో మాటల్లేవ్ అని పూర్తిస్థాయిలో దేశంలో మావోయిస్టులను ఏరివేస్తామని కేంద్ర హోం శాఖ సహాయ మంత్రి బండి సంజయ్ కుమార్ తేల్చి చెప్పారు. ఈ మేరకు ఎన్టీపీసీ జ్యోతిభవన్లో ఏర్పాటుచేసిన మీడియా సమావేశంలో బండి సంజయ్ పాల్గొని పలు అంశాలను వెల్లడించారు. మోడీ పాలనలో భారత్ ప్రగతి పథంలో ముందుకు సాగుతున్నది అని సంతోషం వ్యక్తం చేశారు. సుమారు 6,100 కోట్ల రూపాయలతో తెలంగాణ రాష్ట్రంలో వివిధ రోడ్ల అభివృద్ధి పనులకు కేంద్ర మంత్రి నితిన్ గడ్కరి పనులు ప్రారంభించారని తెలిపారు. తెలంగాణకు కాంగ్రెస్, బీఆర్ఎస్ చేసింది ఏమీ లేదు అని, ఈ రాష్ట్ర అభివృద్ధి శ్రేయస్సు బిజెపి ద్వారానే ముడిపడి ఉందని అన్నారు. కులగణనతో బీసీలకు పూర్తిస్థాయిలో న్యాయం జరుగుతుందని చెప్పారు. మీడియా సమావేశంలో బిజెపి జిల్లా అధ్యక్షులు సంజీవరెడ్డి, నియోజకవర్గ ఇన్చార్జ్ కందుల సంధ్యారాణి,



సోమారపు లావణ్య, బల్మూరు వనిత, మండల అధ్యక్షుడు కోమల్ల మహేష్, హనుమంత్ గౌడ్ , కొమ్మల స్వామి, భూమయ్య, నవీన్, తదితరులు పాల్గొన్నారు.

# పంచాయతీలో జి ప్లస్ త్రీ భవన నిర్మాణాలు

● అక్రమ నిర్మాణాలకు అండగా అధికారులు ● జి ప్లస్ త్రీ అక్రమ నిర్మాణాలకు అధికారుల అండదండలు ● నోటీసులుతో సరిపెడుతున్న వైనం ● గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ అక్రమ నిర్మాణాలు ● జి ప్లస్ త్రీ నిర్మాణానికి సహకరించిన సంబంధిత అధికారులపై చర్యలు తీసుకోవాలి

**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)**లక్ష్మీదేవి పల్లి, మే 5 కొత్తగూడెం నియోజకవర్గం లక్ష్మీదేవి పల్లి మండలంలో నేషనల్ హైవే రోడ్డు ప్రక్కన జి ప్లస్ త్రీ అక్రమ నిర్మాణాలకు మండల పంచాయతీ అధికారుల అండదండలతో ఊపందుకుంది అని అంటున్న ప్రజలు గిరిజన చట్టాలను తుంగలో తొక్కుతూ లక్ష్మీదేవి పల్లి పంచాయతీ పరిధిలో ప్రధాన రహదారి ప్రక్కన చాతకొండ రోడ్డులో అక్రమ జి ప్లస్ త్రీ నిర్మాణాలు మండల కార్యాలయం పక్కనే బహుళ అంతస్తుల నిర్మాణాలు ఊపందుకున్నాయి. అక్రమ నిర్మాణాలని ఆపాల్సిన అధికారులు వారికి అండగా నిలుస్తూ జి ప్లస్ త్రీ నిర్మాణం పూర్తయ్యే వరకు సహకరిస్తున్నారు అనడంలో ఎటువంటి సందేహం లేదు. గత కొన్ని రోజులుగా జర్నలిస్టు జి ప్లస్ త్రీ నిర్మాణాలకు సంబంధించి పూర్తి సమాచారాన్ని పంచాయతీ కార్యదర్శి మండల ఎంపీఓని అడిగినప్పటికీ కాలయాపన చేస్తున్నారు తప్ప నేటి వరకు ఇవ్వకపోవడం చూస్తుంటే జి ప్లస్ త్రీ అక్రమ నిర్మాణాలకు వారి అండ ఏ విధంగా ఉందో స్పష్టంగా కనిపిస్తుంది. ఇంత పెద్ద అక్రమ నిర్మాణం జరుగుతున్న ఎంపీ ఓ కు కానీ పంచాయతీ కార్యదర్శి కానీ కనిపించ లేదంటారా లేదా ఇంకా ఏమైనా జరిగింటుందా అని చర్చించుకుంటున్న ప్రజలు. జి ప్లస్ త్రీ అక్రమ నిర్మాణానికి సహకరించుతున్న ఎంపీ ఓ పంచాయతీ కార్యదర్శిల పై చర్యలు తీసుకోవాలనీ కోరుతున్న ప్రజలు. అనుమతులు లేకుండా నిర్మాణం మొదలుపెట్టిన మొదలుకొని జి ప్లస్ త్రీ నిర్మాణం పూర్తికా వచ్చేవరకు అనగా కొన్ని నెలలుగా నిర్మాణం జరుగుతున్న అడ్డుకోకుండా నోటీసులు కూడా అందజేయకుండా ఏం చేస్తున్నట్టు తెలియాల్సిన ప్రశ్న . ప్రధాన రహదారుల ప్రక్కనే జి ప్లస్ త్రీ నిర్మాణాలు కొనసాగుతున్న అధికారుల కంటపడకపోవడం పలు అనుమానాలకు దారితీస్తుంది.ఈ మధ్యనే అక్రమ నిర్మాణాలు భద్రాచలంలో కూలి అమాయకులు బలైన సంఘటన కళ్ళముందే కదలాడు తుంటే అధికారం ఏం చేస్తున్నారని ఆగ్రహం వ్యక్తం చేస్తున్న ప్రజలు. నేడు



లక్ష్మీదేవిపల్లిలో పునరావృత్తం అయితే పరిస్థితి ఏంటి. దానికి ఎవరు బాధ్యత వహిస్తారు. మండల పంచాయతీ అధికారులు చేయవలసిన పనులు చేయకుండా జి ప్లస్ త్రీ అక్రమ నిర్మాణాలకు సహకరిస్తూ వారి నిర్మాణ పనులన్నీ పూర్తయ్యే విధంగా సహకరిస్తున్నారు అని ఆరోపణలు వినపడుతున్నాయి ఇప్పటికైనా అధికారులు స్పందించి జి ప్లస్ త్రీ నిర్మాణాలను నిలుపుదల చేయవలసిందిగా కోరుతున్న ప్రజలు.

# దక్షిణ జోన్ టెన్‌పిన్ బౌలింగ్ టోర్నమెంట్ రన్నరప్‌గా తెలంగాణ వాసి వివేక్ సింగ్

***విజేతను అభినందించిన టెన్‌పిన్ బౌలింగ్ ఫెడరేషన్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ అజయ్ సింగ్***



**హైదరాబాద్:మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)** దక్షిణ జోన్ టెన్‌పిన్ బౌలింగ్ టోర్నమెంట్‌లో కర్ణాటకకు చెందిన కిషన్.ఆర్, హితాషా సిసోడియా విజేతలుగా నిలవగా.. తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌కు చెందిన యువకుడు వి.ఎస్.వివేక్ సింగ్ రన్నరప్‌గా నిలిచాడని తెలంగాణ టెన్‌పిన్ బౌలింగ్ అసోసియేషన్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి శ్రీధర్ రెడ్డి తెలిపారు. బెంగళూరులోని చర్చ్ స్ట్రీట్‌లోని అమీబా బౌలింగ్ సెంటర్‌లో ఏప్రిల్ 28 నుంచి మే 1వ తేదీ వరకు ఏఆర్సీ సహకారంతో జరిగిన ఈ టోర్నమెంట్‌లో పురుషుల విభాగంలో ఫైనల్‌లో కిషన్.ఆర్ (కర్ణాటక) మొదటి స్థానంలో ఉన్న వివేక్ సింగ్ (తెలంగాణ)పై తలపడి ఉత్కంఠభరితంగా సాగిన మ్యాచ్‌లో కేవలం 5 పిన్స్ తేడాతో విజయం సాధించాడని తెలిపారు. రెండు గేమ్‌ల మొత్తం స్కోరు ఆధారంగా నిర్ణయించిన ఈ పోరులో మొదటి గేములో కిషన్ 179 స్కోరు చేసి వివేక్ (159)పై 20 పాయింట్ల ఆధిక్యం సాధించాడని పేర్కొన్నారు. రెండో గేమ్‌లో వివేక్ సింగ్ 189, కిషన్ 174 స్కోరు చేయగా, మొత్తం 353-348 స్కోరుతో కిషన్ టైటిల్ గెల్చుకున్నాడని వెల్లడించారు. ముందు జరిగిన స్టెప్‌లాడర్ రౌండ్‌లో భాగంగా.. మ్యాచ్ 1లో 5వ సీడ్ పర్వేజ్ అహ్మద్ (కర్ణాటక) 364 స్కోరుతో, లలిత్ కుమార్ (తెలంగాణ- 327) మరియు ఈశ్వర్‌రావు (కర్ణాటక- 324)పై విజయం సాధించాడని తెలిపారు. అలాగే మ్యాచ్ 2లో భాగంగా 4వ సీడ్ నవీన్ సిద్ధాం (తెలంగాణ) 395 స్కోరుతో విజయ్ పంజాబీ (కర్ణాటక- 303), అబ్దుల్ ముజీబ్ (ఆంధ్రప్రదేశ్- 365)పై గెలిచాడని అన్నారు. అదేవిధంగా సెమీ ఫైనల్స్ మ్యాచ్‌లో కిషన్.ఆర్ (394) నవీన్ సిద్ధాం (340), పర్వేజ్ అహ్మద్ (366)పై గెలిచి ఫైనల్‌కు ప్రవేశించాడని తెలిపారు. అలాగే మహిళల విభాగంలో ఫైనల్‌లో హితాషా సిసోడియా (కర్ణాటక) అత్యుత్తమ ప్రదర్శనతో టైటిల్ గెలుచుకుందన్నారు. మొదటి గేమ్‌లో 3వ సీడ్ సనా సలీం (తమిళనాడు) 172 స్కోరుతో స్వల్పంగా ఆధిక్యంలో ఉన్నా, రెండో గేమ్‌లో హితాషా మూడు ఫ్రేములు మూసి, అనంతరం నాలుగు స్ట్రైక్స్‌తో 199 స్కోరు చేసి విజయం సాధించిందన్నారు. మొత్తం స్కోరులో హితాషా 366, సబీనా అధికా (తమిళనాడు) 352, సనా 319 సాధించారని పేర్కొన్నారు. పురుషుల విభాగానికి సంబంధించి (6 గేముల సగటు స్కోరు) వివేక్ సింగ్ (తెలంగాణ)-196.7, పురుషులు (18 గేముల సగటు) వివేక్ సింగ్ - 189.1, మహిళలు (12 గేముల సగటు) హితాషా సిసోడియా- 167.4 సాధించారు. ఈ సందర్భంగా విజేతలను కర్ణాటక స్టేట్ టెన్‌పిన్ బౌలింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఆర్.కన్నన్, టెన్‌పిన్ బౌలింగ్ ఫెడరేషన్ ఇండియా ప్రెసిడెంట్ డాక్టర్ అజయ్ సింగ్ తదితరులు అభినందించారు.

# మైక్రో ఫైనాన్స్ ఆగడాల నుంచి మమ్మల్ని కాపాడండి

**ఎమ్మెల్యే రాందాస్ నాయకి వినతి పత్రం ఇచ్చిన మహిళలు**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)** చుంచుపల్లి, మండలం లోని రామాంజనేయ కాలనీ గ్రామపంచాయతీ లో ప్రజలు మైక్రో ఫైనాన్స్ వసూలు చేసే అధిక వడ్డీల నుంచి మమ్మల్ని రక్షించండి అంటూ ఎమ్మెల్యే రాందాస్ నాయక్ నీ కలిసి వినతి పత్రాన్ని ఇచ్చిన మహిళలు ఈ సందర్భంగా ఎమ్మెల్యే రాందాస్ నాయక్ మాట్లాడుతూ చదువురాని అమాయక ప్రజలకు మాయమాటలు చెప్పి అధిక వడ్డీలకు డబ్బులు ఇచ్చి వారి దగ్గర నుండి బలవంత వసూలు చేస్తూ, డబ్బులు కట్టలేని పరిస్థితిలో ఇళ్లమీదకి వచ్చి దౌర్జన్యం చేస్తూ ఇంట్లో సామాన్లని ఎత్తుకెళ్తూ ప్రజలను భయభ్రాంతులకు గురి చేస్తున్నటువంటి మైక్రో ఫైనాన్స్ ఆగడాలని అరికట్టాలని అన్నారు అనంతరం ఎమ్మెల్యే జిల్లా ఎస్పీ రోహిత్ రాజ్ ఫోన్ చేసి రామాంజనేయ కాలనీ గ్రామపంచాయతీ ప్రజల పరిస్థితిని వివరించి వారికి తక్షణమే న్యాయం చేయాలని తెలిపారు

# టాస్క్‌ఫోర్స్ ఎస్సై ప్రవీణ్ కు మరో అత్యున్నత పురస్కారం

**సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా రియల్ హీరోస్ అవార్డు అందుకున్న ఎస్సై**



**భద్రాద్రి కొత్తగూడెం జిల్లా మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)**కొత్తగూడెం, కొత్తగూడెం టాస్క్‌ఫోర్స్ - సీసీఎస్ ఎస్సై గా విధులు నిర్వర్తిస్తున్న జలకం ప్రవీణ్ సోమవారం హైదరాబాద్ పోలీస్ కమాండ్ కంట్రోల్ రూమ్‌లో జరిగిన కార్యక్రమంలో సీఎం రేవంత్ రెడ్డి చేతుల మీదుగా తెలంగాణ పోలీస్ రియల్ హీరోస్ పురస్కారం అందుకున్నారు. ప్రజల కోసం ప్రాణాలు సైతం పణంగా పెట్టి 24 గంటలు కష్టపడుతున్న పోలీసుల సేవలను గుర్తించి వారికి జీ తెలుగు న్యూస్ ఈ అవార్డులను అందిస్తోంది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన సీఎం రేవంత్ రెడ్డి విశేష సేవలు అందించిన పోలీసులకు అవార్డులను ప్రదానం చేశారు. ఈ సందర్భంగా జిల్లా పోలీస్ అధికారులు, సిబ్బంది ప్రవీణ్ కుమార్ ను అభినందించారు. ఎస్సై ప్రవీణ్ మాట్లాడుతూ ఈ పురస్కారం మరింత బాధ్యతను పెంచిందని, విధి నిర్వహణలో తనకు సహకరించిన జిల్లా అధికారులు, సహచర బృందానికి ఆయన కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో తెలంగాణ ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి కె. రామకృష్ణారావు స్పెషల్ ఛీఫ్ సెక్రటరీ రవిగుప్తా, డీజీపీ డాక్టర్ జితేందర్, హైదరాబాద్ నగర కొత్వాల్ సీవీ ఆనంద్ తదితరులు పాల్గొన్నారు.

# శ్రీ తిరుపతమ్మ దేవస్థానము కు సుమారు 2.5 లక్షల విలువ గల ట్రాక్టర్ ట్రక్కు బహుకరణ





**పెనుగంచిప్రోలు, మే 5( వార్త ప్రభ)** పెనుగంచిప్రోలు లో వేంచేసి వున్న శ్రీ తిరుపతమ్మ అమ్మవారి దేవస్థానము నందు పెనుగంచిప్రోలు గ్రామ వాస్తవ్యులు, దాతలు కర్ల భాస్కరరావు, పద్మావతి దంపతుల కుమారులు కర్ల రామకృష్ణారావు ,వసుందరాదేవి మరియు కర్ల శ్రీనివాసరావు,పద్మావతి వీరి కుమారుడు ఆదిత్య, సాయిభావ్య వార్లు శ్రీ అమ్మవారి దేవస్థానమునకు సుమారు రూ.2.5 లక్షల విలువగల ట్రాక్టర్ ట్రక్కును బహుకరించియున్నారు. వీరు గతంలో రూ.10 లక్షల విలువగల ట్రాక్టర్ ను కూడా బహుకరించి యున్నారు. వీరికి దేవస్థానము తరపున దర్శనం కల్పించి, ఆశీర్వచనం, శేష వస్త్రములు, తీర్థప్రసాదములు మరియు శ్రీ అమ్మవారి చిత్ర పటము అందజేయుట జరిగినది. ఈ కార్యక్రమములో ఆలయ డిప్యూటీ కమీషనర్ మరియు కార్యనిర్వహణాధికారి బిహెచ్.వి.యస్.యన్.కిషోర్ కుమార్, ఆలయ సూపర్డింటెంట్ శ్రీనివాస్, మాజీ చైర్మన్ నూతల పాటి చెన్న కేశవరావు,ధర్మకర్తల సభ్యులు బెజవాడ శ్రీనివాసరావు తదితరులు పాల్గోని యున్నారు.

# ఘనంగా ప్రభాకర్ జన్మదిన ఉత్సవ మహోత్సవ వేడుకలు



**విస్సన్నపేట మే 5( వార్త ప్రభ)**స్థానిక మండల కేంద్రంలో విజయ కృష్ణ ఐరన్ అండ్ హార్డ్వేర్ కంభంపాటి బద్రీనాథ్ భవనం ప్రాంగణంలో టిడిపి సీనియర్ నాయకులు మేసుపా%శీ% ప్రభాకర్ జన్మదినోత్సవ ఉత్సవ మహోత్సవ సంబరాలను ఘనంగా నిర్వహించారు. కేకు కట్ చేసి అందరికీ పంపిణీ చేశారు.ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు పాల్గొన్నారు.

# 1156 కూచిపూడి నృత్య ప్రదర్శనలతో గిన్నస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ సాధించిన బాల సరస్వతి

## అభినందించిన విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి



**విజయవాడ పశ్చిమ మే 5 :(వార్తా ప్రభ ప్రతినిధి)**కూచిపూడి నృత్యంలో 1156 ప్రదర్శనలు ఇవ్వడం ద్వారా గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో స్థానం సంపాదించిన మోదుకూరి బాల సరస్వతిని విజయవాడ నగరపాలక సంస్థ మేయర్ రాయన భాగ్యలక్ష్మి హృదయపూర్వకంగా అభినందించారు.ఈ సందర్భంగా మేయర్ మాట్లాడుతూ కూచిపూడి నృత్యంలో గత 12 సంవత్సరాలుగా శిక్షణ అభ్యసిస్తూ, అందులో ఇప్పటివరకు 1156 నృత్య ప్రదర్శనలు చేసి గిన్నిస్ బుక్ ఆఫ్ వరల్డ్ రికార్డ్ లో చోటు సంపాదించడం గర్వించదగ్గ విషయమని, ఆంధ్రప్రదేశ్ బాలరత్న అవార్డు, లెజెండ్ అవార్డు, నాట్య కళా రవళి, నాట్య మయూరి, నాట్య హంస నందిని, నృత్య తరంగిణి, నాట్య అమృత్యాంజలి, నాట్య కళా హంసిక, ఆజాద్ కా అమృత్ మహోత్సవ అవార్డు, నటరాజ్ అవార్డు లాంటి ఎన్నో అవార్డులు దక్కించుకున్న బాల సరస్వతి నీ స్ఫూర్తి తీసుకొని బాలికలు అన్ని రంగాల్లో ముందంజలో ఉండాలని అన్నారు.ఇలాంటి ప్రతిభావంతులైన యువతిని మన విజయవాడ నగరంలో కలిగి ఉండటం ఎంతో గర్వకారణమని మేయర్ తెలిపారు. ఆమె సాధించిన ఘనత భారతీయ సంప్రదాయ నృత్య కళకు ప్రపంచవ్యాప్తంగా గుర్తింపు తీసుకువచ్చిందని కొనియాడారు. బాల సరస్వతిని చూసి మరెందరో యువతులు నాట్యంలో, ఇతర సృజనాత్మక రంగాల్లో ప్రోత్సాహం పొందే అవకాశముందని పేర్కొన్నారు. విజయవాడ నగరపాలక సంస్థ తరఫున ఆమెకు అన్ని విధాలా మద్దతుగా నిలుస్తామని, భవిష్యత్తులో మరిన్ని విజయాలను సాధించాలని ఆశిస్తున్నామని మేయర్ రాయన భాగ్యలక్ష్మి అన్నారు.ఈ కార్యక్రమంలో మోదుకూరి బాల సరస్వతి తల్లిదండ్రులు మోదుకూరి నాగేశ్వరరావు, భానుప్రియ పాల్గొన్నారు.

# ఆర్టీసీ ఉద్యోగుల సమస్యలు పరిష్కరించాలి


## - తహసీల్దార్ కు ఎన్ఎంయూఏ వినతి



**ఇబ్రహీంపట్నం, మే 5 (వార్తా ప్రభ ప్రతినిధి):**ఆర్టీసీ ఉద్యోగులు ఎదుర్కొంటున్న సమస్యలు పరిష్కరించాలని ఉద్యమ కార్యాచరణలో భాగంగా రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు ఇబ్రహీంపట్నం నేషనల్ మజ్దూర్ యూనిటీ అసోసియేషన్ (ఎన్ఎంయూఏ) డిపో కమిటీ సభ్యులు స్థానిక తహసీల్దార్ వై.వెంకటేశ్వర్లు సోమవారం వినతిపత్రం సమర్పించారు. ఈ సందర్భంగా డిపో ఉపాధ్యక్షుడు బి.ఎన్.రావు మాట్లాడుతూ గత నాలుగు నెలలుగా 1/2019 సర్క్యులర్ ను అమలు చేయకుండా యాజమాన్యం ఉద్యోగులను ఇబ్బందులకు గురి చేస్తుందని ఆవేదన వ్యక్తం చేశారు. ఆర్టీసీలో పాత వైద్య విధానాన్ని, పదోన్నతులను అమలు చేయాలని కోరారు. మహిళా ఉద్యోగులకు చైల్డ్ కేర్ లీవ్ ఇవ్వాలని, గ్యారేజ్, ఆఫీస్ సమస్యలు పరిష్కరించాలని విజ్ఞప్తి చేశారు. ఈ సమస్యలు పరిష్కరించని పక్షంలో భవిష్యత్తులో రాష్ట్ర కమిటీ నిర్వహించే పోరాటాలకు సిద్ధంగా ఉన్నామని హెచ్చరించారు. డిపో అధ్యక్షుడు బి.వి.ఆంజనేయులు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో జిల్లా అసిస్టెంట్ సెక్రటరీ వి.ఎస్.రెడ్డి, జిల్లా నాయకురాలు జి.కుమారి, డిపో జాయింట్ సెక్రటరీ శేషగిరి, చారి, వెంకటేశ్వర్లు, వాసు, పి.ఆర్.శేఖర్, గ్యారేజ్ సభ్యులు వాధూద్, రాంబాబు తదితరులు పాల్గొన్నారు.

# అత్యుత్తమ ప్రతిభ కనబరిసిన వారికి నగదు బహుమతులు

## అందజేసిన ఎం.ఈ.ఓ. రవీంద్ర



**పెనుగంచిప్రోలు, మే 5( వార్త ప్రభ)**పెనుగంచిప్రోలు మండలంలో ప్రభుత్వ పాఠశాలలలో 2024- 25 విద్యా సంవత్సరానికి 10వ తరగతిలో ఎస్ సి సామాజిక వర్గంలో అత్యుత్తమ ప్రతిభ కనబరిచిన విద్యార్థినీలు 1 గొర్రెపాటి నేహ జెడ్ పీ హెచ్ పాఠశాల కొల్లికుల్ల (549) 2 మిట్టచాల రక్షిత. కెవి ఆర్ జె డ్ పీ హెచ్ పాఠశాల పెనుగంచిప్రోలు (532) లను పెనుగంచిప్రోలు మండల విద్యాశాఖ అధికారి రవీంద్ర నాయక్ చేతుల మీదుగా నగదు ప్రశంసా పత్రాలను బహుకరించారు. ఈ నగదు బహుమతులను ప్రశంస పత్రాలను ఈశా ఫౌండేషన్ ఫౌండర్ గుడేటి జీవన్ కుమార్ వారీ అమ్మ జ్ఞాపకార్థం గుడేటి కమలమ్మ పేరు మీదుగా అందజేశారు. ఈ కార్యక్రమంలో పాఠశాల ఇంచార్జ్ సునీల్ కుమార్ మరియు ప్రధానోపాధ్యాయులు విజయ్ కుమార్ స్థానిక పాఠశాల ఉపాధ్యాయులందరూ పాల్గొని విద్యార్థినిలను అభినందించారు. ఎంఈఓ రవీంద్ర మాట్లాడుతూ అత్యుత్తమ ప్రతిభ కనబరిచే వారికి ఎన్నో ప్రోత్సాహాలతో పాటు మంచి భవిష్యత్తు ఉంటుందని రాబోయే రోజుల్లో ఉన్నత స్థానాల్లో నిలిచి మీరు అనేక మందికి ఆదర్శంగా సహాయం చేయాలని తెలియజేశారు.మొదటి బహుమతి 10, వేలు, రెండోవ బహు మతి 5 వేలు ఇద్దరికి ఎం ఈ ఓ రవీంద్ర నాయక్ చేతుల మీదుగా అందజేశారు.ఈ కార్యక్రమంలో సి ఆర్ పీ జొన్నలగడ్డ. చిన్న గోపాలరావు పాఠశాల ల ఉపాధ్యాయులు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉండాలి- జిల్లా కలెక్టర్



**మచిలీపట్నం మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)**ప్రకృతి వైపరీత్యాలు సంభవించినప్పుడు అప్రమత్తంగా ఉంటున్నామని, ఆదివారం జిల్లా వ్యాప్తంగా 648 మిల్లీమీటర్లు వర్షపాతం నమోదయిందని జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ రాష్ట్ర ముఖ్యమంత్రి శ్రీ నారా చంద్రబాబునాయుడుకు తెలిపారు. సోమవారం మధ్యాహ్నం రాష్ట్ర ముఖ్యమంత్రి సచివాలయం నుండి జిల్లా కలెక్టర్లతో వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించి ఆదివారం కురిసిన వర్షాలకు పంట నష్టం తదితర వివరాలపై జిల్లాల వారీగా సమీక్షించారు.ఈ సందర్భంగా ముఖ్యమంత్రి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు ముఖ్యంగా వర్షాలు, పిడుగులు పడే అవకాశం ఉందని ముందుగానే అందరికీ విపత్తు నిర్వహణ సంస్థ నుండి సందేశాలు పంపిస్తున్నామన్నారు.పిడుగు పడటం వలన ఏ ఒక్కరూ ప్రాణాలు కోల్పోకుండా మానవతా దృక్పథంతో ముందస్తు జాగ్రత్త చర్యలు తీసుకోవాలన్నారు.పంచాయతీల్లో కార్యదర్శులు బాధ్యత తీసుకొని గ్రామ ప్రజలను అప్రమత్తం చేసి సురక్షిత ప్రాంతాలకు చేరుకునే లాగా చర్యలు తీసుకోవాలన్నారుఎవరికైనా ఫోన్ లేక లేదా సాంకేతిక కారణాలు వలన సమాచారం అందకపోతే వ్యక్తిగతంగానైనా మనిషిని పంపించి అప్రమత్తం చేయాలన్నారు. ఎక్కడైనా విపత్తు సంభవిస్తే జిల్లా యంత్రాంగం తక్షణమే స్పందించి ఆదుకుంటుందనే నమ్మకం ప్రజల్లో రావాలన్నారు. ప్రభుత్వం జారీ చేసిన మార్గదర్శకాల ప్రకారం మంగళవారం బాధితులకు పరిహారం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు జిల్లా కలెక్టర్ గుడివాడ ఆర్డిఓ కార్యాలయం నుండి వీడియో కాన్ఫరెన్స్లో పాల్గొని మాట్లాడుతూ జిల్లాలో కొన్ని మండలాల్లో ప్రధానంగా ఎక్కువగా వర్షం కురిసిందని, ముఖ్యంగా బంటుమిల్లి మండలంలో 109.2 మిల్లీమీటర్లు, కంకిపాడు మండలంలో 56.2 మిల్లీమీటర్లు, ఉయ్యూరు మండలంలో 52.2 మిల్లిమీటర్లు వర్షపాతం నమోదయిందన్నారు. జిల్లాలో ప్రధానంగా 76 హెక్టార్లలో ఉద్యాన పంటలు దెబ్బతిన్నాయని, అందులో ముఖ్యంగా 64 హెక్టార్లలో అరటి తోటలు దెబ్బతిన్నాయన్నారు.కంకిపాడు లో ఒక గేదె చనిపోయిందని కలెక్టర్ ముఖ్యమంత్రికి వివరించారు.

# రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళా వ్యవసాయ కూలీల మృతి

## ఉదయమే కూలికి వెళ్తుండగా ఆటోని ఢీ కొట్టిన కారు

## పశ్చిమ ఇబ్రహీంపట్నంలో విషాద ఛాయలు



**ఇబ్రహీంపట్నం, మే 5 (వార్తా ప్రభ ప్రతినిధి):** విజయవాడ - హైదరాబాద్ జాతీయ రహదారిపై మూలపాడు చంద్ర హెూటల్ ఎదుట సోమవారం ఉదయం జరిగిన ప్రమాదంలో ఇద్దరు మహిళా వ్యవసాయ కూలీలు దుర్మరణం చెందగా, మరో ఏడుగురు మహిళలు తీవ్రంగా గాయపడ్డారు. పోలీసులు, సేకరించిన సమాచారం ప్రకారం పశ్చిమ ఇబ్రహీంపట్నానికి చెందిన తొమ్మిది మంది మహిళా వ్యవసాయ కూలీలు ఏపీ 16 టీఎస్ 8014 నంబర్ గల అప్పీ ఆటోలో కేతనకొండ ఆర్కే ఇంజనీరింగ్ కాలేజీ రోడ్డులో మొక్కజొన్నలు వలిచే పనికి సోమవారం ఉదయం బయలుదేరారు. వీరు ప్రయాణిస్తున్న ఆటో మూలపాడు సెంటర్ నుంచి రాంగ్ రూట్ లో కేతనకొండ వైపు వెళుండగా చంద్ర హెూటల్ ఎదుట హైదరాబాద్ వైపు నుంచి ఇబ్రహీంపట్నం వైపు వస్తున్న గుర్తు తెలియని బొలేరో వాహనం ఢీకొని ఆగకుండా వెళ్లిపోయింది. ఈ ప్రమాదంలో ఆటోలో ఉన్న వేల్పుల మరియమ్మ (45), భూక్యా దుర్గ (40) దుర్మరణం చెందారు. మరో ఏడుగురు మహిళలు గాయపడ్డారు. ఇందులో ముడావతు గౌరీ (45) తలకు తీవ్ర గాయమై పరిస్థితి విషమంగా ఉన్నట్లు చెబుతున్నారు. కన్నెగంటి స్వప్న, వి.మరియమ్మ తీవ్రంగా గాయపడటంతో వీరి ముగ్గురిని చికిత్స నిమిత్తం 108లో గొల్లపూడిలోని ఆంధ్రా హాస్పిటల్ కు తరలించారు. చింత వసంత, షేక్ మౌలాబీ, వెంకట కుమారి, తుపాకుల దుర్గలను విజయవాడ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. ఆటోను రాంగ్ రూట్ లో నడిపి ప్రమాదానికి గురిచేసిన ఆటోడ్రైవర్ ను పోలీసులు అదుపులోకి తీసుకున్నారు. ఆటోను ఢీకొని వెళ్లిపోయిన బొలేరో వాహనాన్ని పట్టుకునేందుకు గాలిస్తున్నారు. ఇబ్రహీంపట్నం పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.రోడ్డు ప్రమాదంలో ఇద్దరు మహిళలు దుర్మరణం చెందడం, మరో ఏడుగురు మహిళలు తీవ్రంగా గాయపడటంతో పశ్చిమ ఇబ్రహీంపట్నంలో విషాద ఛాయలు అలుముకున్నాయి.

# కుల గణన పై కేంద్ర మంత్రివర్గ నిర్ణయం కాంగ్రెస్ పార్టీ విజయం

## ఎన్టీఆర్ జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్రా కిరణ్



**ఇబ్రహీంపట్నం మే 05(వార్తా ప్రభ ప్రతినిధి):**కేంద్ర ఎన్డీఏ సర్కార్ ఇటీవలే కేంద్ర మంత్రిమండలి సమావేశం లో జనగణ తో పాటు కులగనన కు అనుమతిస్తూ తీర్మానించ డాన్ని కాంగ్రెస్ పార్టీ స్వాగతిస్తున్నామని, కాంగ్రెస్ పార్టీ రాహుల్ గాంధీ గత 11 సంవత్సరాలుగా జనగణ తో పాటు కుల గణన చేపట్టాలని మోదీ ప్రభుత్వం పై ఒత్తిడి తెచ్చిన, ప్రధాని మోడీ కాంగ్రెస్ పార్టీ మరియు ప్రతిపక్ష నేత రాహుల్ గాంధీ ఒత్తిడి మేరకు ఇలాంటి నిర్ణయం తీసుకోవడాన్ని స్వాగతిస్తున్నామని జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు బొర్ర కిరణ్ అన్నారు.దేశంలో దాదాపు 142 కోట్ల మంది పైగా జనాభా ఉన్నారని దాదాపు 30 కోట్ల పైగా నివాసిత గృహాలు ఉన్నాయనీ అన్నారు. ప్రతి ఇంటికి వెళ్లి నిష్పక్షపాతంగా జనగణతో పాటు కులగన, సామాజిక ,ఆర్థిక పరిస్థితులపై పూర్తిస్థాయిలో గణాంకం చేపట్టాలని అన్నారు. రాహుల్ గాంధీ, కాంగ్రెస్ పార్టీ ఒత్తిడి తోనే మోడీ,అమిత్ షా ద్వయం దిగొచ్చారనీ అన్నారు.దేశంలో అధికారంలో ఉన్న తెలంగాణ కర్ణాటక రాష్ట్రాల్లో,ఆయా రాష్ట్రాల ముఖ్యమంత్రులు ఇప్పటికే కులగనన ను పూర్తి చేశారని పేర్కొన్నారు. ఏది ఏమైనప్పటికిని కేంద్రప్రభుత్వం తీసుకున్న నిర్ణయాన్ని స్వాగతిస్తున్నామని, అయితే అణగారిన ప్రజలకు న్యాయం జరగాలంటే,జన గణనతోపాటు కులగణన ఎప్పటిలోగా పూర్తి చేస్తారు అన్న అంశాన్ని ప్రజలకు తెలియజేయాలని కేంద్ర ప్రభుత్వాన్ని బొర్రా కిరణ్ డిమాండ్ చేశారు.ఈ సమావేశం లో పీసీసీ మాజీ ప్రధాన కార్యదర్శి పోతురాజు ఏసుదాస్,చిలుకూరు సర్పంచ్ గొంది సురేష్,అక్కల ప్రసాద్,రాగాలు రాముమరియు చెరుకు ఆనందరావు లు పాల్గొన్నారు.

# రెడ్ క్రాస్ అవార్డుకు ఎంపికైన పశ్చిమ గోదావరి జిల్లా కలెక్టర్ నాగరాణి

## మానవీయ సేవలలో అగ్రగామిగా అత్యున్నత పనితీరును చూపిన చదలవాడ



**విజయవాడ, మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)** మానవీయ సేవల్లో మెరుగైన పనితీరుకు గుర్తింపుగా పశ్చిమ గోదావరి కలెక్టర్, జిల్లా మేజిస్ట్రేట్ చదలవాడ నాగరాణి ఇండియన్ రెడ్ క్రాస్ రాష్ట్ర స్థాయి అవార్డుకు ఎంపిక అయ్యారు. ఇటీవల ముంచెత్తిన వరదలలో స్థానిక ప్రజానీకాన్ని ఆదుకునే ప్రయత్నంలో నాగరాణి చేసిన కృషి గుర్తింపుగా 2023%-24, 2024-%25 సంవత్సరాలకు గాను రెడ్ క్రాస్ ఈ అవార్డును ప్రకటించింది. కనీస రవాణా సదుపాయాలు సైతం అందుబాటులోకి రాని విపత్కర తుఫాను పరిస్థితుల్లో ప్రోటోకాల్ ను పక్కన పెట్టి ద్విచక్ర వాహనంపై లోతట్టు ప్రాంతాలను సందర్శించి బాధితులకు బాసటగా నిలిచారు. బుడమేరు వరద ముంపు బాధితులకు అండగా దాదాపు వారం రోజుల పాటు విజయవాడకు పెద్దయెత్తున ఆహార పదార్థాలను సరఫరా చేయించారు. పశ్చిమ గోదావరి జిల్లా నుండి వరద భాదితుల సహాయార్థం పెద్దయెత్తున నిధులు సమకూర్చి స్వయంగా ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకుకి అందించి మరికొందరికి ప్రేరణగా నిలిచారు. నాగరాణి అందించిన సేవలకు గాను ముఖ్యమంత్రి అభినందనలు అందుకున్నారు. రాష్ట్ర గవర్నర్, రెడ్ క్రాస్ అధ్యక్షుడు మాననీయ ఎస్. అబ్దుల్ నజీర్ మార్గదర్శకత్వంలో రాష్ట్ర రెడ్ క్రాస్ సహజ విపత్తుల సమయంలో సహాయక చర్యలు, రక్తదాన శిబిరాలు, ఫస్ట్ఎయిడ్ శిక్షణా కార్యక్రమాలు, వృక్షారోపణ కార్యక్రమాలు వంటి అనేక మానవతా కార్యక్రమాలు నిర్వహిస్తూ ముందంజలో ఉంది.ప్రపంచ రెడ్ క్రాస్, తలసీమియా దినోత్సవాల సందర్భంగా మే 8న విజయవాడ రాజ్ భవన్ దర్బార్ హాల్లో నిర్వహించనున్న కార్యక్రమంలో గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్ చేతుల మీదుగా కలెక్టర్ నాగరాణికి ఈ పురస్కారం ప్రదానం చేయనున్నారు. 1920లో పార్లమెంట్లో ఆమోదించబడిన చట్టం ద్వారా స్థాపించబడిన ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ, 1954లో సవరణ అనంతరం జాతీయ స్థాయిలో భారత రాష్ట్రపతి, రాష్ట్ర స్థాయిలో గవర్నర్ ఈ సంస్థకు అధ్యక్షత వహిస్తున్నారు. చదలవాడ నాగరాణి అందుకోనున్న ఈ అవార్డు, రాష్ట్రవ్యాప్తంగా మానవతా కార్యక్రమాల బలోపేతానికి కృషిచేస్తున్న సేవాభిమానుల త్యాగానికి ప్రతీకగా నిలుస్తుంది.

# వీరవల్లి గ్రామంలో లేగదూడల అందాల పోటీలు



**హనుమాన్ జంక్షన్,మే5(వార్తాప్రభ)**కృష్ణాజిల్లా బాపులపాడు మండలం వీరవల్లి గ్రామంలో పశు సంవర్ధక శాఖ ఆరోగ్య శిబిరం లేగదూడల అందాల పోటీలు నిర్వహించడం జరిగింది. దూడల అందాల పోటీల్లో గ్రామానికి చెందిన కోడేబోయినబాబి కి చెందిన ఒంగోలు జాతి 8 నెలల వయసు గల ఆవు దూడ మొదటి బహుమతి దక్కించుకుంది. ఈ కార్యక్రమంలో బాపులపాడు పశుసంవర్ధక శాఖ అసిస్టెంట్ డైరెక్టర్ డాక్టర్ శ్రవణ్ కుమార్ వీరవల్లి గ్రామ సర్పంచ్ పిల్ల అనిత, గ్రామ అభివృద్ధి కమిటీ అధ్యక్షులు గుండపనేని ఉమా వరప్రసాద్, ఏఎంసీ మాజీ డైరెక్టర్ కోడేబోయినబాబి, పశు వైద్య అధికారి డాక్టర్ దివ్య, సమన్ బ్యాంక్ వి స్ ఏ డాక్టర్ హరిత, పంచాయతీ వార్డు సభ్యులు అర్వపల్లి వేణు, వెటర్నరీ ఎల్ ఎస్ సి లు రామకృష్ణ, బాబురావు, ఏ హెచ్ ఏ లు జిలాని, సహదేవుడు, అటెండర్ శ్యామల తదితర గ్రామ రైతులు వెటర్నరీ సిబ్బంది పాల్గొన్నారు.

# ఉత్సాహంగా కెయూ ఫార్మసీ కళాశాల "ఫేర్ వెల్ డే " వేడుకలు.




**మచిలీపట్నం మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)** కృష్ణా విశ్వవిద్యాలయం ఫార్మసీ కళాశాల నాల్గవ సంవత్సర బి. ఫార్మసీ విద్యార్థులకు మూడవ సంవత్సరం విద్యార్థులు ఫేర్ వెల్ డే నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిధిగా పాల్గొన్న యూనివర్సిటీ ఉపకులపతి వర్యులు కె. రాంజీ మాట్లాడుతూ నాల్గవ సంవత్సరం పూర్తి చేసుకొన్న విద్యార్థులు అందరూ ప్రాంగాణ ఎంపికల నందు హెటిరో, దివిస్, ఎం. ఎస్. ఎన్ లాంటి ఫార్మా కంపెనీ లందు ఉద్యోగాలు సాధించడం అభినందనీయమన్నారు. ఈ సందర్భంగా ఉద్యోగాలు సాధించిన అభ్యర్థులు తమ తమ ఉద్యోగాలయందు ఉన్నతంగా రాణించి యూనివర్సిటీ కీ పేరు ప్రఖ్యాతులు తీసుకురావాలన్నారు. కొత్త ఫార్మసీ కళాశాల భవనమును అన్ని రకాల సౌకర్యాలతో త్వరలోనే ప్రారంభిస్తామన్నారు. త్వరలో రక్షణ రంగ భాగస్వామ్యంతో ఫార్మసీ నందు డిప్లొమా కోర్స్ ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు.ఫార్మసీ కళాశాల పటిష్టతకు తమవంతు సహకారం అందిస్తామన్నారు. యూనివర్సిటీ రిజిస్ట్రార్ ఎన్. ఉష మాట్లాడుతూ అందరు క్యాంపస్ ప్లేస్ మెంట్స్ లో ఉద్యోగాలు పొందటం అభినందనీయమన్నారు. అందరు అన్నీ విషయాలలో స్వంతంగా నిర్ణయాలు తీసుకుంటూ దైర్యంగా ముందుకు సాగాలన్నారు. ఫార్మసీ కళాశాల ప్రిన్సిపాల్ పి. రాంబాబు మాట్లాడుతూ బి. ఫార్మసీ పూర్తి చేస్కో బోతున్న విద్యార్థులకు అభినందనలు తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థులు ప్రదర్శించిన నృత్యాలు ఆహుతులను అలరించాయి. కార్యక్రమం లో ఫార్మసీ కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది పాల్గొన్నారు.

# ప్రతి సమస్యకు శాశ్వతమైన పరిష్కారం అందించాలి

## విజయవాడ నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్



**విజయవాడ పశ్చిమ మే 5 :(వార్తా ప్రభ ప్రతినిధి)**విజయవాడ నగర పాలక సంస్థ ఇంచార్జ్ కమిషనర్ డాక్టర్ చంద్రశేఖర్ సోమవారం ఉదయం ప్రధాన కార్యాలయంలో గల కమాండ్ కంట్రోల్ రూమ్లో సోమవారం నిర్వహించే ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికను అధికారులతో నిర్వహించారు.ఈ సందర్భంగా ఇంచార్జి కమిషనర్ మాట్లాడుతూ, ప్రజల సమస్యలను వేగంగా, సమర్థవంతంగా పరిష్కరించడం నగరపాలక సంస్థ ప్రధాన లక్ష్యమని పేర్కొన్నారు. ఫిర్యాదులపై వెంటనే స్పందించడంతో పాటు, వాటికి శాశ్వత పరిష్కారం కనుగొనడంపై అధికారులకు సూచనలు ఇచ్చారు.ఈ సోమవారం నిర్వహించిన ప్రజా ఫిర్యాదుల పరిష్కార వేదికలో 9 ఫిర్యాదులు అందగా అందులో పట్టణ ప్రణాళిక సంబంధించినవి 4, ఇంజనీరింగ్ 3 , రెవెన్యూ సంబంధించినవి 1, ఉద్యానవనం 1 మొత్తం కలిపి 9 ఫిర్యాదులను అందుకున్నారు అధికారులు.ఈ కార్యక్రమంలో చీఫ్ సిటీ ప్లానర్ సంజయ్ రత్నకుమార్, చీఫ్ ఇంజనీర్ ఆర్ శ్రీనాథ్ రెడ్డి, డిప్యూటీ కమిషనర్ రెవెన్యూ జి సృజన, సూపరిండెంటింగ్ ఇంజనీర్లు పి.సత్యనారాయణ, పి సత్యకుమారి, ఇన్చార్జి చీఫ్ మెడికల్ హెల్త్ ఆఫీసర్ డాక్టర్ గోపాల్ కృష్ణ నాయక్, రీజినల్ ఫైర్ ఆఫీసర్ వెంకటేశ్వరరావు, డిప్యూటీ డైరెక్టర్ హార్టికల్చర్ రామ్మోహన్, వెటర్నరీ అసిస్టెంట్ సర్జన్ డాక్టర్ బి సోమశేఖర్ రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

# సాఫ్ట్ బాల్ జాతీయ పోటీలకు ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి



**మైలవరం :మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)**సాఫ్ట్ బాల్ జాతీయ పోటీలకు స్థానిక డా లకిరెడ్డి హనిమి రెడ్డి ప్రభుత్వ డిగ్రీ కళాశాల విద్యార్థి ఎంపికైనట్లు కళాశాల ప్రిన్సిపాల్ డా.ఇల్లా రవి [illegible] తెలిపారు.ఈనెల 5వ తేదీ నుంచి 9వ తేదీ వరకు నెల్లూరులోని విక్రమ సింహపురి విశ్వ విద్యాలయంలో నిర్వహిస్తున్న సాఫ్ట్ బాల్ పురుషుల ఆల్ ఇండియా ఇంటర్ యూనివర్సిటీ పోటీలలో కృష్ణ యూనివర్సిటీ తరపున ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో బి.కాం. మూడవ సంవత్సరం చదువుతున్న కె.నరసింహారావు ఎంపిక కావడం జరిగిందని తెలియజేశారు.విజయవాడ కృష్ణవేణి డిగ్రీ కళాశాలలో జరిగిన కృష్ణ యూనివర్సిటీ అంతర్ కళాశాల సాఫ్ట్ బాల్ పురుషుల పోటీలలో మెరుగైన ప్రతిభ ప్రదర్శించిన విద్యార్థి నరసింహారావు జాతీయ పోటీలకు ఎంపిక కావడం జరిగిందని అన్నారు.విక్రమ్ సింహపురి యూనివర్సిటీలో నిర్వహిస్తున్న జాతీయ అంతర్ విశ్వవిద్యాలయాల పోటీలలో కూడా నరసింహా రావు మెరుగైన ప్రదర్శన ఇవ్వాలని కళాశాల ప్రిన్సిపాల్ ఇల్లా రవి ఆకాంక్షించారు.విద్యార్థి నరసింహరావుకు కళాశాల ఫిజికల్ డైరెక్టర్ మేజర్ మన్నే స్వామి,కళాశాల అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది,విద్యార్థులు అభినందనలు తెలియజేశా రు.

# ప్రమాదవశాత్తూ అగ్ని ప్రమాదం

## ట్రాక్టర్, గడ్డివాము దగ్ధం

**వరంగల్, :మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)**వర్ధన్నపేట మండలం ఇల్లంద గ్రామ శివారు కొత్తపల్లి రోడ్డు పై ట్రాక్టర్లో తరలిస్తున్న గడ్డివాము కు ప్రమాదవశాత్తు మంటలు అంటుకున్నాయి. గడ్డివాము తో పాటు ట్రాక్టర్ దగ్ధం అయింది. ప్రమాదాన్ని గ్రహించి డ్రైవర్ మరియు సహాయకులు తప్పించుకున్నారు.ప్రమాద స్థలానికి చేరుకున్న అగ్నిమాపక సిబ్బంది మంటలను అదుపులోకి తెచ్చే ప్రయత్నం చేసారు.

# రైతు సమస్యలపై జిల్లా కలెక్టరుకు వినతి



**అమలాపురం మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)**అంబేద్కర్ కోనసీమ జిల్లా వైసిపి పార్టీ అధ్యక్షులు చిర్ల జగ్గిరెడ్డి అమలాపురం నియోజకవర్గ కో-ఆర్డినేటర్ డా:పినిపే శ్రీకాంత్, జెడ్పీ చైర్మన్ విప్పర్తి వేణుగోపాల్, ఎమ్మెల్సీలు కుడుపూడి సూర్యనారాయణ రావు,బొమ్మి ఇజ్రాయెల్ రాజోలు నియోజకవర్గ ఇంచార్జి గొల్లపల్లి సూర్యారావు రామచంద్రాపురం నియోజకవర్గ ఇంచార్జి పిల్లి. సూర్యప్రకాస్,రాష్ట్ర ప్రధానకార్యదర్శి చెల్లుబోయిన శ్రీనివాసరావు అమలాపురం వైఎస్సార్సీపీ టౌన్ ప్రెసిడెంట్ సంసాని నాని జిల్లా రైతుల అధ్యక్షులు జిన్నూరి వెంకటేశ్వర రావు, వైఎస్సార్సీపీ నాయకులు గుత్తుల చిరంజీవి, ఒంటెద్దు వెంకన్న నాయుడు. మోటూరి సత్యం కాపు,కుడుపూడి భరత భూషణ్. కేత భాను తేజ,సుధ గణపతి, కటకం శెట్టి ఆదిత్య కొల్లాటి దుర్గ బాయ్, నాగ బత్తుల కొండ, దొమ్మేటిసుధాకర్, తదితరులు పాల్గొన్నారు

# ఉచిత కంటి వైద్యా శిబిరం లో గుర్తించిన 137 మందికి కళ్ళజోళ్ళు పంపిణీ



. పెనుగంచిప్రోలు, మే 5( వార్త ప్రభ ) జయప్రద ఫౌండేషన్ చైర్మన్, తెలుగుదేశం పార్టీ రాష్ట్ర నాయకులు తొండపు దశరథ జనార్దన్ ఆధ్వర్యంలో నడుస్తున్న ఉచిత వైద్య శిబిరంలో భాగంగా గత వారంలో ముళ్లపాడు గ్రామంలో నిర్వహించిన కంటి వైద్య శిబిరంలో గుర్తించిన 137 మందికి కళ్ళజోడులను టిడిపి సమన్వయ కమిటీ సభ్యులు నెట్టెం శివరా%శీ%, వై వి ఎస్ రెడ్డి చేతుల మీదుగా అందజేయటం జరిగింది. అలాగే కంటి శుక్లాలకు సంబంధించి 66 మందిని గుర్తించగా వారిలో మొదటిసారి 35 మందికి శంకర్ నేత్రాలయం విజయవాడ వారి దగ్గర మంగళవారం నాడు ఆపరేషన్లు జరిపించ బడునని కో - ఆర్డినేటర్ కట్టా వెంకట నరసింహారావు తెలిపారు.ఈ కార్యక్రమంలో గుత్తా హనుమంతరావు, ఉమ్మనేని పుల్లారావు, చంద్రుపట్ల లక్ష్మీనరసింహారావు తదితరులు పాల్గొని కళ్ళజోడులు అందజేయడం జరిగింది.

# కార్మిక చట్టాలపై అవగాహన ఉండాలి..

## -11వ అదనపు జిల్లా న్యాయమూర్తి సుబ్రహ్మణ్యం



**గుడివాడ : మే 5( వార్త ప్రభ )** కార్మిక చట్టాలపై అవగాహన కలిగి ఉండాలని పట్టణ పారిశుధ్య కార్మికులకు, భవన నిర్మాణ కార్మికులకు మండల లీగల్ సెల్ అథారిటీ చైర్మన్, 11వ అదనపు జిల్లా న్యాయమూర్తి శ్రీ జి. సుబ్రహ్మణ్యం గారు పిలుపునిచ్చారు. సోమవారం సాయంత్రం స్థానిక ఓల్ మున్సిపల్ ఆఫీస్ వెనుక ఉన్న కైకాల పురపాలక సంఘ మందిరంలో గుడివాడ మండల న్యాయ సేవాధికార సంస్థ ఆధ్వర్యంలో మేడే వారోత్సవాల్లో భాగంగా న్యాయ విజ్ఞాన సదస్సు నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిధిగా హాజరైన సుబ్రహ్మణ్యం గారు మాట్లాడుతూ తొలుత పారిశుద్ధ్య కార్మికుల సేవలు అభినందనీయమని ప్రశంసించారు. కార్మికులు ప్రతి ఒక్కరూ తప్పనిసరిగా తమ వృత్తిలో నైపుణ్యత (స్కిల్ డెవలప్‌మెంట్) సాధించినప్పుడే వృత్తిలో రాణించ గలుగుతారన్నారు. కార్మికులకు సౌకర్యవంతమైన పని గంటలు, పని వాతావరణం, వేతనాలు అందిస్తే వారు దేశప్రగతికి తోడ్పాటునందిస్తారని అన్నారు. ఏ దేశ ప్రగతినైనా నిర్దేశించే సత్తా కార్మిక వర్గానికి ఉంటుందన్నారు. చట్టాలపై, సంక్షేమ పథకాలపై అవగాహన కలిగేలా ప్రకటనలు చేయాలనీ ఈ సందర్భంగా శాఖాధికారులకు సూచించారు. ముఖ్యంగా శాఖాపరమైన ఇబ్బందులు ఎదురైనప్పుడు ఉచిత న్యాయ సహాయం ఎలా పొందాలో తెలియజేశారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమీషనర్ సింహాద్రి మనోహర్, అసిస్టెంట్ కమీషనర్ శ్రీనివాసరావు, లీగల్ సెల్ ఎయిడ్ కన్వీనర్ యశోద యామిని, లేబర్ ఆఫీసర్, అడ్వకేట్స్ షేక్ మహ్మద్ రఫీ, చోరగడి కుటుంబరావు, విమలాదేవి, శివరామకృష్ణ మరియు పారాలీగల్ వాలంటీర్లు తదితరులు పాల్గొన్నారు.

# ప్రకృతి పరిరక్షణకు యువతరం పిలుపు



**విజయవాడ పశ్చిమ, మే 5 :(వార్తా ప్రభ ప్రతినిధి)**'ప్రకృతిని కాపాడుకుందా... మన జీవితాలను ఆనందమయం చేసుకుందాం' అంటూ నినాదాలు చేస్తూ యువతరం పర్యావరణ పరిరక్షణ కోసం పిలుపునిచ్చింది. కె.బి.ఎన్.కళాశాల ఎన్.ఎస్.ఎస్ మరియు ఎస్.సి.సి విభాగాల ఆధ్వర్యంలో సోమవారం విద్యార్థులు వేసవి ఎద్దడి దృష్ట్యా పక్షులు, జంతువుల పరిరక్షణ, వాటికోసం ఆహారధాన్యాలు, నీటి చెలమల ఏర్పాటు అవసరాన్నివివరిస్తూ అవగాహన యాత్ర నిర్వహించారు. మొత్తం 500 మంది విద్యార్థులు బృందాలుగా ఏర్పడి, ప్లకార్డులు ప్రదర్శిస్తూ పశ్చిమ నియోజకవర్గంలోని వివిధ ప్రాంతాల్లో పర్యటించారు. ఇంటిటికి వెళ్ళి, వేసవిలో పక్షుల దాహార్తి తీర్చటం కోసం నీటి పాత్రలు ఏర్పాటుచేయాలని సూచిస్తూ, అందుకు ఉపయోగించే మట్టి పాత్రలు పంపిణీ చేసారు. పర్యావరణ సమతుల్యత ఉన్నప్పుడు మానవ మనుగడ సాధ్యమంటూ అవగాహన కల్పించారు. తొలుత కళాశాలలో నిర్వహించిన కార్యక్రమంలో ప్రిన్సిపాల్ డాక్టర్ జి.కృష్ణవేణి మాట్లాడుతూ ప్రకృతి, పర్యావరణం, జీవవైవిధ్యం అంశాల పట్ల విద్యార్థులకు పూర్తి అవగాహన కోసం కళాశాల వేదిక కార్యక్రమాలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. హిందూ హై స్కూల్స్ అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ డాక్టర్ వి.నారాయణరావు మాట్లాడుతూ కె.బి.ఎన్. కళాశాల ప్రాంగణాన్ని 'పర్యావరణ హిత కేంద్రం'గా తీర్చిదిద్దుతున్నట్లు చెప్పారు. కళాశాలలో ఎంపిక చేసిన కేంద్రాల్లో పక్షులు, ఇతర జీవుల కోసం నీటి పాత్రలు, పక్షులకు ధాన్యపు గింజల పాత్రలు ఏర్పాటుచేసారు. ఎన్.ఎస్.ఎస్. ప్రోగ్రాం ఆఫీసర్ ఎన్.సాంబశివరావు, ఎన్.సి.సి అధికారి కెప్టెన్ కె.పి.టి. విజయభాస్కర్, వైస్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.వేంకటేశ్వరారావు, పి.ఎల్.రమేశ్ తదితరులు పాల్గొన్నారు.

# రైతులను దగా చేస్తున్న కూటమి ప్రభుత్వం- నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు.

## తువ్వ కాలువ గండ్లు పనులను తక్షణమే పూర్తి చేయాలి



**వత్సవాయి మే 5 (వార్తప్రభ)** మండల పరిధిలో ఆలూరుపాడు, వేమవరం మరియు పెనుగంచిప్రోలు మండలం పరిధిలో ఉన్న ముచ్చింతాల, అనిగండ్లపాడు, గుమ్మడిదూరు, వెల్దుర్తిపాడు గ్రామాల పరిధిలో ఉన్న తువ్వ కాలవ అక్టోబర్ నెలలో వచ్చిన వరదలకు కోతకు గురై 45 చోట్ల గండి పడి పొలాలపై ఇసుక మేట వేసిన సంగతి తెలిసినదే, ఈ గండ్లు అన్ని పూర్తి చేయాలి ప్రభుత్వాన్ని డిమాండ్ చేస్తూ సోమవారం వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ఆధ్వర్యంలో స్థానిక వైఎస్ఆర్ సీపీ నాయకులతో కలిసి తువ్వకాలువ పరిశీలన నియోజకవర్గ వైఎస్ఆర్ సీపీ ఇన్-ఛార్జ్ తన్నీరు నాగేశ్వరరావు.ఈ సందర్భంగా మాట్లాడుతూ 6 నెలలు గడుస్తున్నా కానీ ఇప్పటివరకు ఒక్క గండి కూడా పూడ్చలేదు.రైతులు పైన చిత్తశుద్ధి లేని ప్రభుత్వం, ఇసుక మట్టి రవాణా పై ఉన్న దృష్టి రైతులకు పొలాల్లో ఇసుక మేటలు తొలగించే దానిపై లేదు.ఒకపక్క రైతులకి ధాన్యానికి సరైన గిట్టుబాటు ధరలు లేక నానా అవస్థలు పడుతుంటే మరో పక్కన ఈ గండ్లు పూడ్చకూడ నీరు అందించకపోవడం తీవ్ర మనోభావానికి గురవుతున్నారు.వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ తరఫున గతంలో కలెక్టర్ కి రైతులు తమ పొలాలలో ఉన్న ఇసుక మేటలు తొలగించకకు అవకాశం కల్పించండి అని చెప్పిన ఇంతవరకు ఎక్కడ కూడా ఆ ఉసే కనిపించలేదు.ఈ గండ్లు పూడ్చకపోతే పొలాలకు నీరు అందదు నీరు వృధాగా పోతుంది. తువ్వకాలవ గండ్లు విషయం లో ఈ ప్రభుత్వం 1 కోటి 60 లక్షలు ఎస్టిమేషన్ వేసిన కూడ ఇంతవరకు పనులు మొదలుపెట్టలేదు. అదేవిధంగా ఇసుక మేటలు వేసిన పొలాలకు ఎకరానికి 50,000 నష్టపరిహారం అందించాలి.ఇప్పుడు రబీకి నీళ్ల అందక పొలాలు ఇసుకమేటలతో నిండిపోవడం వల్ల రైతులు వ్యవసాయం చేసుకోవడానికి వీలు కుదరక ఆశలు వదులుకున్నారు. ఖరీఫ్ దృష్టి ఉంచుకొని ఇప్పుడైనా తువ్వకాలువ గండ్లు పనులు మొదలుపెట్టి పూర్తిస్థాయిలో తక్షణమే పూర్తి చేసి రైతులకు నీరు అందే విధంగా చూడాలని కోరారు.ఈ కార్యక్రమంలో రాష్ట్ర ఎంపీపీ సంఘాల అధ్యక్షులు మార్కపుడి గాంధీ, జిల్లా రైతు విభాగ అధ్యక్షులు ఏలూరి శివాజీ, జిల్లా కార్యదర్శి చల్లా వైకుంఠరావు, మండల పార్టీ అధ్యక్షులు పొన్నం కోటేశ్వరరావు, గుత్తా శంకర్ రావు, వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ వివిధ అనుబంధ సంఘాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

# సమన్వయంతో పాటుపడాలి



**అమలాపురం మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)**కోనసీమ జిల్లాలో నూతనంగా ఏర్పడిన అమలాపురం అర్బన్ డెవలప్మెంట్ అథారిటీ కార్యకలాపాలు అత్యంత సమర్థవంతంగా పారదర్శకంగా నిర్వహించేందుకు బోర్డు కమిటీ సభ్యులు పూర్తి సమన్వయంతో పాటుపడాలని జిల్లా జాయింట్ కలెక్టరు మరియు అముడా ఉపాధ్యక్షులు టి. నిషాంతి సూచించారు. అముడా కార్యాలయము నందు బోర్డు సభ్యులతో ప్రప్రథమంగా సమావేశాన్ని నిర్వహించి బోర్డు కార్యకలాపాల తీరు గూర్చి చర్చించి ప్రతిపాదనలపై సభ్యుల అనుమతితో పలు తీర్మానాలకు ఆమోదం మరియు పలు సవరణ దిద్దుబాటు చర్యలు గూర్చి సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అముడా అథారిటీ ఏర్పడిన తర్వాత కార్యాలయం జీవో నెంబర్ 35 ప్రకారం ఎస్టాబ్లిష్మెంట్, ఫర్నిచర్ అథారిటీకి సంబంధించిన నిబంధనలు గూర్చి బోర్డు సభ్యులకు వివరించామన్నారు. కార్యాలయం నిర్వహణ కార్యాలయంలోనే కార్యనిర్వహక కమిటీ ఏర్పాటు, కమిటీ విధి విధానాలు గూర్చి వివరించారు.అముడా పరిధిలో భవన నిర్మాణ అనుమతులు ఫీజులు నిర్ణయం, లేశఅవుట్లు భవనాలు అనుమతులు కార్యాలయానికి సంబంధించి లాప్టాప్ లు కంప్యూటర్లు కొనుగోలు అంశాలకు సంబంధించిన సవరణ దిద్దుబాటు చర్యలు, టేబులు కుర్చీలు ఫర్నిచర్ ఏర్పాటు క్యాలెండరును బట్టి వాహనాలు ఏర్పా టు, డేటా ఎంట్రీ ఆపరేటర్ ఆఫీస్ సబార్డినేట్ నియమకాలు వికాస ద్వారా చేపట్టుట, లోగో డిజైనింగ్ పంచాయితీ నుండి డెవలప్మెంట్ చార్జీలు ఆన్లైన్ సాఫ్ట్వేర్ 300 గజాలు పైబడిన అనుమతులన్నింటినీ అముడా పరిధిలోనే ఇచ్చేందుకు సాఫ్ట్వేర్ ఏర్పాటు. పట్టణ ప్రాంతాల్లో కూడా 300 లోపు గజాలకు సంబంధించి అనుమతులను మున్సిపల్ పట్టణ ప్రణాళిక విభాగం ద్వారా ఇస్తారని తెలిపారు.అద్దె భవనంలో అముడా కార్యాలయం కొనసాగుతోందన్నారు ప్రస్తుతం అముడా పరిధిలో మూడు అసెంబ్లీ నియోజకవర్గాలు మాత్రమే ఉన్నాయని మిగిలినవి,రుడా,కుడా పరిధిలో ఉన్నాయని జిల్లా అంతటిని యూనిట్ గా చేసేందుకు ప్రతిపాదించామన్నారు. అముడా అథారిటీ ఏర్పడిన తదుపరి రెండు సంవత్సరాలకు అమలాపురం మాస్టర్ ప్లాన్ అమలు చేయాలని బోర్డు ప్రతిపాదించిందన్నారు. అమలాపురం పట్టణ ప్రాంతంలో ప్రభుత్వ భూములు ఉపయోగపడేవి ఏమైనా ఉన్న యెడల అముడా కు అప్పగించాలని జిల్లా యంత్రాంగాన్ని కోరుతూ బోర్డు తీర్మానించిందన్నారు. అముడా పరిధిలో ఇంజనీరింగ్ ఎస్టేట్ వింగ్ అకౌంటింగ్ విభాగాలను ఏర్పాటుకు ప్రభుత్వం ద్వారా ఏర్పాటుకు బోర్డు ప్రతిపాదించిందన్నారు. సాఫ్ట్ వేర్ ఏర్పాటుకు ప్రతిపాదనలు కార్యాలయంలో నాలుగు ఏసీలు ఏర్పాటుకు ప్రతిపాదించామన్నారు.గ్రామపంచాయితీలలో అముడ కార్యకలాపాలు గూర్చి అవగాహన కొరకు విస్తృత ప్రచారం గావించడం వంటి అంశాలపై చర్చించారు. అముడా ఏర్పడిన తర్వాత 2024- 25 ఖర్చులు నివేదికలను బోర్డు సభ్యులు అనుమతితో ఉపాధ్యక్షులు ఆమోదించారు. ఈ కార్యక్రమంలో అమ్ముడా చైర్మన్ అల్లాడ స్వామి నాయుడు,బోర్డు సభ్యులు ట్రాన్స్కో ఎస్సీ, ఎస్.రాజబాబు, జిల్లా కాలుష్య నియంత్రణ మండలి ఈ ఈ శంకర్ రావు,రహదారులు భవనాల శాఖ ఎస్సీ బి. రాము,జిల్లా పరిశ్రమల కేంద్రం జనరల్ మేనేజర్ పీకే పీ ప్రసాద్, ప్లానింగ్ అధికారి సత్యమూర్తి తదితరులు పాల్గొన్నారు.

# సంఘ జీవులం సమాజ సేవకులం మనం భారతీయులం

## - ప్రొఫెసర్ సి ఎస్ ఆర్ కె. ప్రసాద్



**కాకినాడ మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)** ఆదిత్య డిగ్రీ పీ జీ కళాశాలలో ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ రాష్ట్ర శాఖ కాకినాడ శాఖ వారిచే యూత్ రెడ్ క్రాస్ రాష్ట్రస్థాయి శిక్షణా శిబిరం ముగింపు వేడుకలు ఘనంగా నిర్వహించినట్లు ఆదిత్య డిగ్రీ, పీజీ కళాశాలల అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ బి ఈ వి ఎల్ నాయుడు తెలిపారు.ఇండియన్ రెడ్ క్రాస్ సొసైటీ ఆధ్వర్యంలో నాలుగు రోజుల రాష్ట్ర స్థాయి సదస్సు ముగింపు వేడుకలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమానికి అధ్యక్షత వహించిన రెడ్ క్రాస్ రాష్ట్ర చైర్మన్ వై డి.రామారావు మాట్లాడుతూరాష్ట్రంలో తొలిసారిగా యూత్ రెడ్ క్రాస్ స్టేట్ క్యాంప్ నిర్వహించామని అన్నారు. నేర్చుకున్న విషయాలను సమాజ సేవకై వినియోగించాలని పిలుపునిచ్చారు. తదుపరి చిత్తూరు కో-ఆర్డినేటర్ వి. చిరంజీవి క్యాంప్ రిపోర్టును తెలిపారు. ప్రత్యేక అతిథిగా విచ్చేసిన అకడమిక్ డైరెక్టర్ డాక్టర్ నాయుడు మాట్లాడుతూ రాష్ట్ర స్థాయి క్యాంపును తమ కళాశాలలో నిర్వహించడం ఆనందంగా ఉందని అన్నారు. ఈ క్యాంపు ద్వారా విద్యార్థులు తెలుసుకున్న విషయాలను తమ వ్యక్తిగత మరియు సమాజ శ్రేయస్సుకు వినియోగించుకోవాలని తెలిపారు.ఈ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా విచ్చేసినజేఎన్టీయూ కాకినాడ ఉపకులపతి ప్రొఫెసర్ సి ఎస్ ఆర్ కె ప్రసాద్ ఐ ఆర్ సి ఎస్ గొప్ప లీడర్స్ ను తయారు చేస్తుందని అన్నారు. ఈ శిక్షణలో పాల్గొన్న విద్యార్థులను చూస్తుంటే ఆనందంగా ఉందని మంచి కమ్యూనికేషన్ ఉందని అన్నారు. పూర్వీకులు ప్రకృతిని ప్రేమించారని పాడు చేయలేదని తెలిపారు. భారతీయులు సంఘ సేవకు,సమాజ శ్రేయస్సుకు ప్రాధాన్యత ఇస్తారని తెలిపారు. ఆచార్యులు కూడా మన సంస్కృతి వైపు అడుగులు వేస్తున్నారని అన్నారు. ప్రకృతి పరిరక్షణ, సమాజ సేవలో రెడ్ క్రాస్ వాలంటీర్లు ముందు ఉండడం హర్షించదగ్గ విషయమని అన్నారు. అనంతరం వాలంటీర్లకు ప్రశంసా పత్రాలను అందించారు. ఈ సందర్భంగా మాట్లాడిన వాలంటీర్స్ తమకు ఆతిథ్యం ఇచ్చిన ఆదిత్యకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు. ఈ శిబిరానికి విచ్చేసి తమ అమూల్యమైన సందేశాన్ని విద్యార్థులకు అందించిన శిక్షకులకు కాకినాడ రెడ్ క్రాస్ వైస్ చైర్మన్,డాక్టర్ నల్లమిల్లి సుగుణారెడ్డి,సెక్రటరీ కె. శివకుమార్ ధన్యవాదాలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆదిత్య మహిళా డిగ్రీ కళాశాల ప్రిన్సిపాల్ శ్రీమతి కరుణ, ఐఆర్సిఎస్ సభ్యులు జి.శివరామకృష్ణ, నోడల్ ఆఫీసర్ తేజేశ్వరరావు, కోఆర్డినేటర్లు ఎస్.దుర్గా దేవి, ఎస్ సత్యనారాయణ,ఎస్.మల్లేశ్వరరావు,వి. చిరంజీవి,వి.నాగరాజు, వాలంటీర్లు పాల్గొన్నారు.

# డీఎస్సీ అభ్యర్థులకు ఉచిత కోచింగ్

## కాకినాడ ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ వెల్లడి

## నిరుద్యోగ యువత సద్వినియోగం చేసుకోవాలని వినతి



**కాకినాడ, మే 5 (వార్తాప్రభ ప్రతినిధి):** త్వరలో నిర్వహించనున్న మెగా డీఎస్సీ-2025 కు హాజరవుతున్న నిరుద్యోగ యువతీ యువకులకు ఉచితంగా కోచింగ్ అందించనున్నట్లు కాకినాడ ఎంపీ తంగెళ్ల ఉదయ్ శ్రీనివాస్ తెలిపారు. సోమవారం ఆయన కాకినాడలో క్యాంప్ కార్యాలయంలో మాట్లాడుతూ గత ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీ మేరకు కూటమి ప్రభుత్వం 16, 347 ఉపాధ్యాయ పోస్టులతో మెగా డీఎస్సీ నిర్వహిస్తుందన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలో ఆర్థికంగా వెనకబడిన నిరుద్యోగ యువత శిక్షణకు వేలాది రూపాయలు వెచ్చించలేక ఇబ్బందులు పడుతున్నారని, దీని అధిగమించి నిరుద్యోగ యువతను ప్రోత్సహించేందుకు కాకినాడలో ప్రసిద్ధి చెందిన శ్యామ్ ఇనిస్టిట్యూట్ ద్వారా అభ్యర్థులకు ఆన్ లైన్ ద్వారా మెరుగైన శిక్షణ తో పాటు డైలీ టెస్ట్ సిరీస్ నిర్వహించేందుకు ఏర్పాట్లు చేశామన్నారు. కాకినాడ పార్లమెంట్ పరిధిలోగల నిరుద్యోగ యువత ఈనెల ఏడవ తేదీ లోపు గూగుల్ ప్లే స్టోర్ నుండి 'శ్యామ్ ఇనిస్టిట్యూట్ ఆచార్య' యాప్ ను ఇన్స్టాల్ చేసుకుని తగినన్ని వివరాలు నమోదు చేసి రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. మెగా డీఎస్సీకి హాజరవుతున్న నిరుద్యోగ యువత ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, మరిన్ని వివరాలకు కాకినాడ విద్యుత్ నగర్ లో క్యాంప్ కార్యాలయంలో సంప్రదించాలని ఎంపీ ఉదయ్ శ్రీనివాస్ కోరారు.

# సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులు పంపిణీ



**జగ్గయ్యపేట మే 5 (వార్తప్రభ)** పట్టణంలో శాసనసభ్యులు శ్రీరాం రాజగోపాల్ తాతయ్య నివాసంలో జగ్గయ్యపేట మండలం బూదవాడ గ్రామానికి చెందిన పటాపంచుల వెంకమ్మ 18,000, పొదిల గంగరాజు 75,000 అదేవిధంగా తిరుమలగిరి గ్రామానికి చెందిన గూటి బాజీ 8500, మాతంగి వాణి 13,000 లకు ఇటీవల అనారోగ్యంతో వివిధ ప్రైవేట్ ఆస్పత్రిలో చికిత్స పొందిన అనంతరం ఆ బిల్లులను ఎమ్మెల్యే శ్రీరాం రాజగోపాల్ తాతయ్య రిఫరెన్స్ లెటర్ ద్వారా సీఎం సహాయ నిధికి అప్లై చేయగా సీఎం సహాయ నిధి నుండి మంజూరైన సీఎం రిలీఫ్ ఫండ్ చెక్కులను సోమవారం తాతయ్య వారి నివాసంలో బాధిత కుటుంబ సభ్యులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో దర్శి విజయ నరసింహారావు, మైలా రమణారెడ్డి, పసుపులేటి శ్రీనివాసరావు, పటాపంచుల తిరపారావు, గుమ్మ మధు, గుడారు నాగర్జున, గండు కిషోర్,మారేపల్లి భాష, బొప్పాల మనోజ్, కరిసే సాల్మన్, పల్లెబోయిన నాగరాజు, ఇమ్మడి వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

# షాపుల బహిరంగ వేలం కు ఆహ్వానం

## మారెమ్మ గుడి ఎగ్జిక్యూటివ్ ఆఫీసర్ వి డి డి ప్రసాద్



**విస్సన్నపేట మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)**స్థానిక మండలంలో పుట్రెల గ్రామం పొలిమేరలో వేంచేసి ఉన్న ఆలయ ప్రాంగణంలో పూజా ద్రవ్యాలు పాట వస్తువులు అమ్ముకునేందుకు పాడుకునేందుకు సంబంధిత వివరాలను తమ కార్యాలయంలో సంప్రదించవలసిందిగా ఆలయ కార్యనిర్వాహక అధికారి వి డి డి ప్రసాద్ మీడియా సమావేశంలో తెలియజేశారు. 4 ,5 ,6,7,8,9 షాపులు ఎనిమిదవ తేదీ పది గంటలకు బహిరంగ వేలంలో ఒక్కొక్క షాపుకు పదివేల రూపాయల ధరావత్తు కట్టి పాటలో పాల్గొనాలని ఆయన తెలిపారు. అదే రోజు మధ్యాహ్నం రెండు గంటలకు వినగడప శ్రీ జగన్మోహన వేణుగోపాలస్వామి హుండీ లెక్కింపు జరుగుతోందని చెప్పారు.

# కుప్పాల దేదీప్య సాయి ని ఘనంగా సన్మానించిన జనసేన నాయకులు ముత్యాల కామేష్




**నూజివీడు, మే 5 (వార్తాప్రభ ప్రతినిధి)**నూజివీడు పట్టణంలోని శ్రీ శారద విద్యాసంస్థలలో విద్యను అభ్యసిస్తూ ఇంటర్మీడియట్ ద్వితీయ సంవత్సరంలో 1000 మార్కులకు గాను 991 మార్కులు సాధించి నూజివీడు పేరుని రాష్ట్రస్థాయిలో నిలిపినందుకు శ్రీ శారద విద్యాసంస్థల అధినేత కుప్పాల శంకర రావు రాధిక దంపతుల కుమార్తె కుప్పాల దేదీప్య సాయి ని నూజివీడు గవర్నమెంట్ ఏరియా హాస్పిటల్ డెవలప్మెంట్ సొసైటీ మెంబర్,జనసేన పార్టీ నాయకులు ముత్యాల కామేష్ ఘనంగా సన్మానించడం జరిగింది..ఈ కార్యక్రమంలో శ్రీ శారద విద్యాసంస్థల అధినేత కుప్పాల శంకర్రావు , శ్రీ శారద జూనియర్ కాలేజీ ప్రిన్సిపాల్ చామకూరి నాగబాబు , శ్రీ శారద ఒలంపేడు స్కూల్ ప్రిన్సిపాల్ ఇజ్రాయిల్ , సీనియర్ అధ్యాపకులు డాక్టర్ ముత్యాల వేణు గోపాల్ , జనసేన నాయకులు దద్దనాల శివ , కాసుల లక్ష్మి శ్రీనివాస్ , పాటిమీద సుబ్బారావు , ఇందుపల్లి ప్రేమ్ కుమార్ , చీమల ఉదయ్ కుమార్ , జంగం గూడెం గ్రామ తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు పాటిమీద హనుమంతరావు , కాలేజీ అధ్యాపకులు యడ్ల గోవర్ధన , నెల్లూరు శ్రీకాంత్ , గంగుల దేవకుమార్ మరియు సిబ్బంది తదితరులు పాల్గొన్నారు...

# నిధుల దుర్వినియోగానికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శి పై చర్యలు తీసుకోండి.

## పబ్లిక్ గ్రీవెన్స్ లో కలెక్టర్ కు సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ ఫిర్యాదు

**అవనిగడ్డ :మే5(వార్తాప్రభ ప్రతినిధి )** కృష్ణా జిల్లా కోడూరు మండలం కోడూరు గ్రామ పంచాయతీలో రూ 36,46,976ల నిధుల దుర్వినియోగానికి పాల్పడిన పంచాయతీ కార్యదర్శి పై తగు క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించారు.నిధుల దుర్వినియోగం విషయమై మండల పంచాయతీల విస్తరణ అధికారి ఆర్.నాగరేవతి ఫిబ్రవరి 13న మచిలీపట్నం డి ఎల్ పిఓ వారికి తమ నివేదికను సమర్పించారని ఈ విషయమై జిల్లా పంచాయతీ అధికారి సదరు కార్యదర్శి పై తగు క్రమశిక్షణా చర్యలు తీసుకోవాలని కోరుతూ సోమవారం మచిలీపట్నం కలెక్టరేట్ లో జరిగిన పబ్లిక్ గ్రీవెన్స్ కార్యక్రమంలో సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ జిల్లా కలెక్టర్ కు వినతి పత్రం అందించారు.కోడూరు పంచాయతీలో రూ 36, 46,976 ల నిధుల దుర్వినియోగం విషయం సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాస్ గౌడ్ పబ్లిక్ గ్రీవెన్స్ లో కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో వెలుగులోకి రావడంతో అవనిగడ్డ నియోజకవర్గంలో హాట్ టాపిక్ గా మారింది.



Printer Publisher and owned by V. Sree Ram Yadav. Printed at Arunodaya Notebook Mfrs Pvt Ltd #33-5-9, Papaiah Street, Seetharampuram, Vijayawada .krishna Dist. AP. and Published from # 34-2-74, Bellapu Shobhanadri Street, Kasthuribaipeta, Vijayawada. Krishna Dt. AP Editor V. Sree Ram Yadav, RNI No. 12176/2004 E-mail: varthaprabhatelugudaily@gmail.com. Cell: 9347993188